teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక


## కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు ప్రారంభం



05


ములుగు | సంపుటి : 04 | సంచిక : 108 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 26 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.






# ఆర్థిక మోసాలపై రౌడీ షీట్లు

## శాంతిభద్రతల పరిరక్షణకు సర్కార్ కీలక నిర్ణయం

- సైబర్ క్రైమ్ నేరాలపై నిఘా పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు
- భవిష్యత్తులో నేరాలకు పాల్పడకుండా చర్యలు
- అవాంఛనీయ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా ఆదేశాలు




02

రాష్ట్రంలో శాంతిభద్రతలను గాడిన పెట్టేందుకు తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియా నేరాలు, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలంటూ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, సైబర్ క్రైమ్ విభాగం నుంచి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలకు తాజాగా ఆదేశాలు వెలువడ్డాయి.

## రెండు రాష్ట్రాల్లో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్లపై ఈడీ దాడులు

### కేసులో విశాఖ వైద్యుల పాత్రపై దృష్టి



02

- సరోగసీ చట్టాల ఉల్లంఘన, ఆర్థిక లావాదేవీలపై ఈడీ ఫోకస్
- మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు
- ఇప్పటికే నమ్రతతో పాటు పలువురి అరెస్టు

## పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు తర్వాతే ఈవీఎంల లెక్కింపు




- ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ఈసీ చర్యలు
- ఓట్ల సంఖ్య పెరగడం వల్లే ఈ నిర్ణయం
- జాప్యాన్ని నివారించేందుకు ఈసీ ప్రణాళిక
- ఈసీ తీసుకున్న 30వ కీలక నిర్ణయం

02



## భూభారతి కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలు పెంపు

- ఫీల్డ్ స్టాఫ్‌కు ప్రభుత్వం సముచిత గౌరవం టీజీటీఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తింపు
- రూ.12 వేల నుంచి రూ.28,148కి వేతనాల పెంపు
- సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు
- చిరకాల కోరిక నెరవేరినందుకు హర్షం వ్యక్తం

.. వివరాలు 2లో



## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసిన సీఎం

- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచన
- కరెంట్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి
- హైదరాబాద్‌లో బృందాలు అప్రమత్తం

## ఇంటర్‌లో కొత్త సిలబస్

- AI క్లాసులు, కోచింగ్ అందించేలా బోర్డు ప్రణాళికలు
- 494 అధ్యాపక పోస్టుల భర్తీకి కసరత్తు
- ప్రభుత్వ కాలేజీల్లో మిడ్డే మీల్స్, యూనిఫామ్స్
- విద్యార్థుల హాజరుశాతం పెంపునకు ఫేస్ రికగ్నిషన్
- అన్ని జిల్లాల్లో సోషల్ మీడియా సెల్స్
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్స్

02



## తెలంగాణ వైపు అల్పపీడనం

- రెండు రోజులు భారీ వర్షాలు
- వాయుగుండంగా మారనున్న అల్పపీడనం
- 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్
- 7 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- హైదరాబాద్ లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

02



## బతుకమ్మ గిన్నిస్ రికార్డ్ కోసం ఏర్పాట్లు

- మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, సీతక్క సమీక్ష
- సెప్టెంబర్ 29న 10 వేల మంది మహిళలతో వేడుకలు
- ట్యాంక్‌బండ్ పై బతుకమ్మ కార్నివాల్, ర్యాలీలు
- 63 అడుగుల బతుకమ్మతో గిన్నిస్ రికార్డ్ లక్ష్యం
- బతుకమ్మ నిమజ్జనం ప్రాంతాల్లో చర్యలకు సూచన
- సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశాలు

02





## భారత వైమానిక దళానికి కొత్త బలం

### తేజస్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ శాఖ ఒప్పందం

- రూ.62,370 కోట్లతో హెచ్‌ఏఎల్ తో ఒప్పందం
- తేజస్ మార్క్-1ఏలో 64 శాతం స్వదేశీ పరిజ్ఞానం
- ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ప్రోత్సాహం
- మిగ్-21 స్థానంలో కొత్త తేజస్ విమానాలు
- భారత వైమానిక దళ సామర్థ్యం పెరుగుదల

02



## కేటీఆర్ అరెస్ట్ తప్పదు

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు
- ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్‌కు ఇబ్బందులు
- ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్, కేటీఆర్‌లపై విమర్శలు
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుపై ధీమా
- అక్టోబర్ 4న రాహుల్ గాంధీ అబ్జర్వర్ల పర్యటన

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అరెస్టుపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్ అరెస్టు తప్పదని అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన పలు కీలక అంశాలపై ముచ్చటించారు. ఫోన్ ట్యాపింగ్ చేసి కేసీఆర్, కేటీఆర్ ఎన్నికల్లో గెలిచారని విమర్శించారు. కోమటిరెడ్డి

మిగతా 2 లో





### హామీల అమలు డిమాండ్ నేపథ్యంలో

## అంగన్‌వాడీల అరెస్ట్

- సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంలో ఘటన
- అంగన్‌వాడీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్
- ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వం తీసుకున్న ప్రీ ప్రైమరీ స్కూల్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం అంగన్‌వాడీ టీచర్లు చలో సెక్రటేరియట్‌కు

మిగతా 2 లో



## సినిమా టికెట్ల ధరలు పెంచేది లేదు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టీకరణ
- ఓజీ సినిమా టికెట్ ధరల పెంపుపై హైకోర్టు ఉత్తర్వులు
- హైకోర్టు నిర్ణయాన్ని స్వాగతించిన మంత్రి
- ఇకపై సినిమా టికెట్ల పెంపుపై జీఓలు ఉండవని వెల్లడి

02

# ఆర్థిక మోసాలపై రౌడీ షీట్లు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో శాంతిభద్రతలను గాడిన పెట్టేందుకు తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియా నేరాలు, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలంటూ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, సైబర్ క్రైమ్ విభాగం నుంచి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలకు తాజాగా ఆదేశాలు వెలువడ్డాయి. ఇందులో భాగంగా సోషల్ మీడియా నేరాలు, ఆర్థిక మోసాలకు అలవాటైన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో వారు ఎలాంటి నేరాలకు పాల్పకుండా వారిపై భారతీయ నేర సంహిత సెక్షన్-111 ప్రకారం సస్పెక్ట్, రౌడీ షీట్స్, హిస్టరీ షీట్స్ తెరవాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా నిందితుల కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల అవాంఛనీయ కార్యకలాపాలను అడ్డుకట్ట పడుతుందని, రాష్ట్రంలో శాంతిభద్రతలను అదుపు ఉంటాయని తాజా ఉత్తర్వులలో పేర్కొన్నారు.




## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసిన సీఎం



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. అన్ని కలెక్టర్లు హై అలెర్ట్ గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. అవసరమైతే ముందుగానే ప్రజలను ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలను తరలించాలని సూచించింది. అన్ని కాజ్ వేలను పరిశీలించి రోడ్లపైకి వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగా ట్రాఫిక్ ను నిలిపివేయాలన్నారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించడంతో పాటు, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యాసంస్థలు కూడా వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షం కురిసే సమయంలో అనవసరంగా జనం రోడ్లపైకి రావొద్దని సూచించారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి.

## భారత వైమానిక దళానికి కొత్త బలం



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): భారత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కోసం 97 మార్క్-1ఏ తేజస్ యుద్ధ విమానాలు కొనుగోలు చేయడానికి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్‌పై రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం సంతకం చేసింది. ప్రధాని మోడీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ ఆగస్టులో విమానాల కొనుగోలుకు ఆమోదం తెలపగా తాజాగా డీల్‌పై అధికారిక ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ. 62,370 కోట్లు ఖర్చు చేయనుండగా 97 మార్క్-1ఏ విమానాలను హెచ్ఏఎల్ తయారు చేయనుంది. ఇందులో 68 సింగిల్ సీటర్ ఫైటర్ జెట్స్, 69 ట్విన్ సీటర్ ట్రెయినింగ్ విమానాలు, సంబంధిత పరికరాలు, ఇతర సిస్టమ్స్ ఉన్నాయి. ఈ విమానాల డెలివరీ 2027-28లో ప్రారంభమై ఆరు సంవత్సరాలలో పూర్తవుతుందని కేంద్రం తెలిపింది. ٢64 శాతం స్వదేశీ కంటెంట్ తేజస్ ఎంకే-1ఏ విమానం 64 శాతం కంటే ఎక్కువ స్వదేశీ కంటెంట్ కలిగి ఉంటుంది. గత ఒప్పందం కంటే అదనంగా 67 పరికరాలను ఇందులో జోడించారు. అలాగే యాక్టివ్ ఎలక్ట్రానిక్ స్కాన్డ్ అర్రే రాడార్ (ఏఈఎస్ఏ), స్వయం రక్ష కవచ్, కంట్రోల్ సర్ఫేస్ యాక్యుయేటర్‌ల వంటి అధునాతన స్వదేశీ అభివృద్ధి చేసిన వ్యవస్థలు ఉన్నాయి. ఇది ఆత్మనిర్భర్ భారత్ చొరవలను మరింత బలోపేతం చేస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా, 2021ఫిబ్రవరిలో రక్షణ మంత్రిత్వ శాఖ హెచ్ఏఎల్‌తో రూ. 48,000 కోట్ల డీల్‌పై సంతకం చేసింది. ఆ డీల్ ప్రకారం భారత వైమానిక దళం 83 తేజస్ విమానాలను అందుకోవాల్సి ఉంది.

### మిగ్-21స్థానంలో భర్తీ !

మార్క్-1ఎ విమానం వైమానిక దళంలో మిగ్-21 విమానాల స్థానాన్ని భర్తీ చేయనుంది. ఎయిర్ ఫోర్సులో ప్రస్తుతం 31 స్క్వాడ్రన్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. అయితే అధీకృత బలం 42 స్క్వాడ్రన్లుగా ఉంది. అటువంటి పరిస్థితిలో తేజస్ ఎయిర్ ఫోర్సులో గేమ్ ఛేంజర్‌గా మారుతుందని నిపుణులు భావిస్తున్నారు. తేజస్ వైమానిక దళ సామర్థ్యాన్ని పెంచడమే గాక రక్షణ ఉత్పత్తిలో స్వావలంబన భారత్ లక్ష్యాన్ని కూడా వేగవంతం చేస్తుందని అంచనా వేస్తున్నారు. కాగా, మిగ్-21 శుక్రవారం భారత వైమాణిక దళం నుంచి వైదొలగనున్న విషయం తెలిసిందే.



## పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు తర్వాతే ఈవీఎంల లెక్కింపు






న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకతను పెంపొందించడానికి కేంద్ర ఎన్నికల సంఘం మరో కీలక నిర్ణయం తీసుకుంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రక్రియను క్రమబద్ధీకరిస్తూ గురువారం కీలక ప్రకటన చేసింది. ఇకపై పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాతనే ఈవీఎంల చివరి రెండవ రౌండ్ ను లెక్కించాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం కౌంటింగ్ రోజున ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మొదలవుతుండగా ఈవీఎం లెక్కింపు 8:30 గంటలకు ప్రారంభమవుతున్నది. అయితే ఇటీవల వికలాంగులు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి వద్ద ఓటు వేయడానికి ఈసీ అనుమతి ఇచ్చింది. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో కొన్ని స్థానాల్లో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుకంటే ముందే ఈవీఎంల లెక్కింపు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో జాప్యంతో పాటు, అనవసరపు గందరగోళాన్ని నివారించేందుకు వీలుగా ఇకపై ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తున్న క్రమంలో చివరి రెండో రౌండ్ కౌంటింగ్ కంటే ముందే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తి చేయనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయ్యేకే ఈవీఎంల మిగిలిన రెండు రౌంట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా ఉన్నట్లయితే ఆ మేరకు తగినన్ని టేబుళ్లు, సిబ్బంది ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఈసీ ఆదేశించింది. కాగా ఎన్నికల ప్రక్రియను మరింతగా మెరుగుపరిచేందుకు ఎన్నికల సంఘం గత ఆరునెలల్లో ఇప్పటి వరకు వివిధ అంశాలపై 29 నిర్ణయాలు తీసుకోగా ఇది 30వ నిర్ణయం.

## బతుకమ్మ గిన్నిస్ రికార్డ్ కోసం ఏర్పాట్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): ఈ నెల 29న గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని, ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. సమీక్షలో మంత్రులు మాట్లాడుతూ ఈ నెల 27న ట్యాంక్‌బండ్ పై బతుకమ్మ కార్నివాల్, 28న బైక్, సైకిల్ ర్యాలీలు, 29న సరూర్‌నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో బతుకమ్మ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, 30న ట్యాంక్ బండ్‌పై సద్దుల బతుకమ్మ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు, దీనికి అనుగుణంగా ప్రతిష్ఠాత్మకంగా సన్నాహాలు జరగాలని సూచించారు. ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, ట్యాంక్ బండ్‌తో పాటు పీవీ మార్గ్, సచివాలయం, సరూర్ నగర్ స్టేడియం పరిసర ప్రాంతాలన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. బతుకమ్మల నిమజ్జనం బతుకమ్మలను నిమజ్జనం చేసే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అలర్ట్ చేశారు. మహిళలకు సౌకర్యాలు కల్పించాలని వారు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పండగ ప్రాశస్త్యానికి అద్దం పట్టేలా హైదరాబాద్‌లో చారిత్రక ప్రదేశాలతో పాటు ప్రధాన జంక్షన్లను అందమైన ఆకృతులతో, విద్యుత్ దీపాలతో అలంకరించాలి, వైభవోపేతంగా నిర్వహించాలని ఆదేశించారు. పర్యాటక, సాంస్కృతిక, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పోలీస్, ట్రాన్స్‌కో, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

### స్టేడియంలో పది వేల మందితో వేడుకలు.

సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 29న పది వేల మందితో బతుకమ్మ వేడుకలు, 63 అడుగుల ఎత్తైన బతుకమ్మను ఏర్పాటు చేసి గిన్నిస్ బుక్ రికార్డుల్లో చేర్చేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రులు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను తరలించే బాధ్యతను సెర్ప్ అధికారులు తీసుకోవాలని, దీనికి తోడు మిగిలిన వారిని తీసుకువచ్చేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. జానపద, గిరిజన కళాకారుల మధ్య వేలాదిమంది మహిళలు బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు, హైదరాబాద్ నగర వాసులు పెద్ద ఎత్తున బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొని విజయంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు. ఈ సమీక్షలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభ రాణి, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ వల్లూరు క్రాంతి, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రెండు రాష్ట్రాల్లో "సృష్టి ఫెర్టిలిటీ సెంటర్లపై" ఈడీ దాడులు



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ లోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్లో సరోగసీ పేరుతో జరుగుతున్న మోసాలు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో ఈడీ అధికారులు రెండు రాష్ట్రాల్లోనూ సోదాలు చేపట్టారు. కేసు దర్యాప్తులో విశాఖకు చెందిన వైద్యులపాత్ర కూడా ఉన్నట్లు తేలిన తరుణంలో ఏపీలోనూ సోదాలు చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలలో ఉన్న ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సరోగసీ చట్టాల ఉల్లంఘన, సరోగసీ కోసం జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఈడీ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈకేసులో ఇప్పటికే డాక్టర్ నమ్రత సహా పలువురు అరెస్టైన విషయం తెలిసిందే. దీనిపై సిట్ దర్యాప్తు కొనసాగుతుండగా తాజాగా ఈడీ రంగంలోకి దిగింది. సరోగసీ మాటున జరుగుతున్న మోసాల్లో ఎవరెవరున్నారో బయటకులాగే దిశగా ఈడీ ఫోకస్ పెట్టింది.

## భూభారతి కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలు పెంపు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): టెర్రాసిస్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఫీల్డ్ స్టాఫ్‌ను భూభారతి కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారిని టీజీటీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తిస్తూ, అదేవిధంగా వేతలను పెంచుతూ తాజాగా ఆదేశాలు జారీ అయ్యాయి. టెర్రాసిస్ అనే ప్రైవేట్ సంస్థ తరఫున ధరణి ఆపరేటర్లుగా ఉన్న వారిని తెలంగాణ భూభారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్‌గా టీజీటీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులుగా సముచిత గౌరవాన్ని కల్పించారు. రూ.12 వేలు ఉన్న నెల జీతాన్ని రూ.28,148లకు పెంచుతూ ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్‌కు విజయదశమి కనుక అయ్యింది. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇంతటి నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫీల్డ్ స్టాఫ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమ చిరకాల కోరిక నెరవేర్చిన ప్రభుత్వానికి, సీసీఎల్ఏ లోకేష్ కుమార్, సీఎమ్మార్వో పీడీ మకరందం, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డిలకు తెలంగాణ భూ భారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది.

## సినిమా టికెట్ల ధరలు పెంచేది లేదు

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): ఓజీ సినిమా టికెట్ ధరలను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా దానిని సవాల్ చేస్తూ మహేశ్ యాదవ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ జరిపిన కోర్టు కొత్త సినిమాల టికెట్ల ధరలను పెంచడాన్ని సస్పెండ్ చేసింది. తాజాగా హైకోర్టు జారీ చేసిన ఈ ఉత్తర్వులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. సినిమా టికెట్ ధరలపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. కొత్త సినిమాల టికెట్ ధరలను పెంచేది లేదని తాను గతంలోనే అసెంబ్లీలో చెప్పానని, పక్క రాష్ట్రం జీఓ ఇవ్వడంతో ఇక్కడ కూడా కొన్ని సినిమాలకు వెసులుబాటు ఇచ్చామని పేర్కొన్నారు. ఇకపై ఎలాంటి సినిమాలకైనా టికెట్ ధరలను పెంచుకునేలా అనుమతులు ఇవ్వబోమని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. సినిమా టికెట్ ధరల పెంపు కారణంగా సామాన్యుడు చాలా నష్టపోతున్నాడన్నారు. ఇకపై సినిమా టికెట్ రేట్ల పెంపుపై జీఓలు ఉండవని తెలిపారు. సినీ ఇండస్ట్రీని హైదరాబాద్ హబ్ గా మారుస్తామని, ఇందుకోసం ప్రభుత్వం తరఫున ఎలాంటి రాయితీలకైనా సిద్ధంగా ఉన్నామని, అభిమానులపై మాత్రం భారం వేయకూడదని చెప్పారు.

## తెలంగాణ వైపు అల్పపీడనం

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తెలుగు రాష్ట్రాల వైపు వేగంగా కదులుతోంది. ప్రస్తుతం దీని ప్రభావంతో అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయితే ఆ అల్పపీడనం గురువారం రాత్రికి లేదా ఈరోజు ఉదయానికి వాయుగుండంగా మారనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఈ వాయుగుండంగా మారిన శనివారం సాయంత్రం ఉత్తర కోస్తా సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వాయుగుండం ప్రభావం తెలంగాణపై అధికంగా ఉండబోతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉంటే అధికారుల అంచనా ప్రకారం ఈ రోజు తెలంగాణలోని 12 జిల్లాల్లో అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురవనున్నాయి. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నేడు తెలంగాణ మధ్యలో ఉన్న 7 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. అలాగే కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, సూర్యాపేటలలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. హైదరాబాద్ నగర వ్యాప్తంగా మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు తేలికపాటి వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా రాత్రి, రాత్రిపూట, తెల్లవారుజామున మోడరేట్ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## కేటీఆర్ అరెస్ట్ తప్పదు

మొదటి పేజీ తరువాయి

రాజగోపాల్‌రెడ్డి విషయం ఏఐసీసీ పరిధిలో ఉందని సరైన సమయంలో సరైన నిర్ణయం అధిష్ఠానం తీసుకుంటుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. డీసీసీల అంశంపై సమావేశంపై గురువారం మధ్యాహ్నం రాహుల్ గాంధీతో మీటింగ్ ఉంటుందని, ఈ సమావేశానికి ఏఐసీసీ కొత్తగా ఎంపిక చేసిన 22 మంది అబ్జర్వర్లు హాజరవుతారని చెప్పారు. అక్టోబర్ 4వ తేదీన 22 మంది అబ్జర్వర్లు తెలంగాణలో పర్యటిస్తారని వెల్లడించారు.

# పేద వాని సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): పేద వాని సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు రాష్ట్ర, ఐటి పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గురువారం కాటారం మండల కేంద్రంలోని బిఎల్ఎం గార్డెన్స్ లో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, మహిళ శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణమాసం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించి వారు తయారు చేసిన వంటకాలను రుచి చూశారు. అనంతరం అర్హులైన 300 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడం లక్ష్యంగా పోషణ మాసం కార్యక్రమ చేపట్టడం జరిగిందన్నారు. మరొకటి పేద వాడి సొంతింటి కల నెరవేర్చడం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకుకు వచ్చి అర్హులైన లబ్ధిదారులకు నేడు మంజూరు పత్రాలు అందించడం జరుగుతుందన్నారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు, గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని, అట్టి జాబితా ను గెజిటెడ్ అధికారులతో విచారణ నిర్వహించి నిరుపేదలను ఎంపిక చేసినట్లు తెలిపారు. నియోజక వర్గం వ్యాప్తంగా 3500 ఇళ్ళు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రతి సంవత్సరం 3500 ఇళ్ళు మంజూరు చేసి నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో ఇల్లు నిర్మాణం చేపట్టని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందించే విధంగా చర్యలు తీసుకోబోతున్నామని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఒక్క ఇల్లు అందించలేదని తెలిపారు. మంజూరు అయిన ఇళ్లకు 5 లక్షలతో నిర్మాణము జరుగుతుందని, 4 విడతలుగా నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి సోమ వారం లబ్ధిదారుల అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు రాకుండా మహిళా సంఘాలు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. 400 నుండి 599 ఎస్ ఎఫ్ టీ వరకు ఇంటి నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అంతకు మించి సైజు పెరిగితే బిల్లులు విడుదల కావని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం కోసం ఉచితంగా ఇసుకను అందించడం జరుగుతుందని అన్నారు. అలాగే సిమెంట్ కూడా తక్కువ దరకు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు 20వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. రైతు ఋణ మాఫీ, విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని తెలిపారు. పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు నేడు ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఒక ఇల్లు నిర్మిస్తే ఒక కుటుంబాన్ని నిలబెట్టిన వాళ్లుగా నిలిచిపోటామని తెలిపారు. పేదోళ్లకు ఇబ్బందులు కలిగించే పనులు చేయొద్దని మారుమూల ప్రాంత ప్రజలకు సేవ చేయడానికి వచ్చారు సేవలు చేయాలని ప్రజలను మన్ననలు పొందాలని తెలిపారు. నిర్మాణంలో జాప్యం లేకుండా ఎంపీడీవోలు గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని, ఇల్లు నిర్మాణం ఆగిపోతే ఎంపీడీవోలు గృహ నిర్మాణ శాఖ అధికారుల వేతనాల నుంచి కోత విధిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రభుత్వ అధికారులు గానీ ఇతరులు ఎవరైనా లబ్ధిదారులను డబ్బులు అడిగితే పోలీస్ కేసు నమోదు చేయాలని సూచించారు. మీ ఆశలను నెరవేర్చాలని లక్ష్యంతో ప్రభుత్వం ఇందిర ఇల్లు మంజూరు చేసిందని మంజూరైన ప్రతి లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవాలని సూచించారు. ఇల్లు నిర్మాణంతో సంతోషంగా ఉండాలని, మనం మనం గుర్తుకు రావాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. గెజిటెడ్ అధికారులతో విచారణ జరిపి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేశామని తెలిపారు. ఏఐ ద్వారా కూడా విచారణ చేపట్టామని తెలిపారు. లబ్ధిదారులు ఫోటో దిగిన చోట మాత్రమే ఇళ్లు నిర్మాణం చేపట్టాలని, 4 విడతలుగా లబ్ధిదారులకు డబ్బు జమ చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు త్వరిత గతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ఇబ్బంది ఉన్న లబ్ధిదారులకు మహిళా సంఘాలు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణీ లకు సీమంతం, కళ్యాణ్ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ట్రేడ్ ప్రమోషన్ ఛైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, ఉపాధిహామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు రమేష్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుమల సమ్మయ్య, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, మహిళా, శిశు సంక్షేమ అధికారిణి మల్లీశ్వరి, మిషన్ భగీరథ ఈఈ శ్వేతా, మహాదేవపూర్ సింగిల్ విండో ఛైర్మన్ తిరుపతి రెడ్డి, సీడీపీఓ రాధిక పాల్గొన్నారు.

# ప్రాధాన్యతా రంగాలకు అధిక రుణాలు అందిచాలి




## అత్యధికంగా పంట రుణాలను ఇవ్వాలి

## లబ్ధి దారులకు జాప్యం లేకుండా రుణాలు ఇవ్వాలి

## బ్యాంకర్ల సమావేశంలోఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): రుణ లక్ష్యసాధనకు సమన్వయం అవసరమని శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో బ్యాంకర్లు, అధికారులతో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందేశం ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణ లక్ష్యం 1221.72 కోట్లు కాగా అందులో 136.74 కోట్లు రుణ లక్ష్యం సాధించారన్నారు. రుణ లక్ష్య సాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలో పంట రుణాలు, ఎం.ఎస్.ఎం.ఈ, హౌసింగ్, ఎడ్యుకేషన్, వ్యవసాయ రుణాలను సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు అమలులో లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా రుణాలు అందించాలని అన్నారు. ఆయా బ్యాంకుల్లో పెండింగ్ లో ఉన్న యూనిట్లను బ్యాంకు అధికారులతో తరుచూ సంప్రదించి రుణ ప్రక్రియ పూర్తి చేయాలి అన్నారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామ స్థాయిలో లబ్దిదారులకు అవగాహనా పరిచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో రైతు వేదికలు ఉన్నాయని ప్రతినెల సమావేశాలు చేపట్టి రుణ ప్రగతి పెంచేందుకు మండల స్థాయి అధికారులకు కృషి చేయాలని అన్నారు. అత్యధికంగా పంట రుణాలు ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పాడి పరిశ్రమకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అదే విధంగా కోళ్ల ఫారాలు నెలకొల్పుకునేందుకు సెరికల్చర్ చేపట్టేందుకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. పట్టణ ప్రాంతంలో వీధి వ్యాపారులకు రుణాలు సకాలములో ఇవ్వాలన్నారు. ఇదేవిధంగా రుణ లక్ష్యాలను పెంచుతూ ఇదే దిశగా రుణాలను పెంచుతూ అత్యధిక మంది నిరుపేదలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ అధికారులు సహకరించాలన్నారు. విద్యా రుణాలు అధిక మొత్తంలో ఇవ్వాలని విద్యాభివృద్ధి కృషి చేయాలన్నారు. రికవరీ శాతం పెంచినపుడే బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తాయని అధికారులు ఆ దిశగా కృషి చేయాలన్నారు. మహిళశక్తిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు మోడల్ సి ఎస్ సి సెంటర్స్ ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిదంగా రుణాలు పొందిన లబ్ధిదారులకు అధికారులు వెన్నంటి ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్.బి.ఐ. ఎల్.డి.ఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, యూబీఐ దిజిఎం, టిజిబి ఆర్ ఎం, జిల్లా అధికారులు, ఎల్.డి.ఎం. ఎ.తిరుపతి మరియు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమాలు

## నూతన రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

## వరికి బదులుగా ఆయిల్ పామ్ సాగు చెయాలి

## ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

## జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్న విస్తీర్ణం

## ఎకరానికి లక్షన్నర ఆదాయం



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): గురువారం జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న నెల్లికుదురు, ఇనుగుర్తి, తొర్రూరు, పెద్దవంగర మండలాలలోని పలు గ్రామాలు సందర్శించి రైతులకు పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ సాగు చేయాలని మరియు మేలైన యాజమాన్య పద్దతులను తెలిపారు. ప్రభుత్వం కల్పించే ఎకరానికి మొక్కలు, బిందు సేద్యం, యాజమాన్యం మరియు అంతర పంటలకు యాభై వేలు రాయితీ పొంది ఆయిల్ పామ్ తోటలు నాటాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రో ట్రేలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి మానస, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారులు వెంకట్, నీరజ, రంజిత్, ఉద్యాన విస్తరణ అధికారి యాదయ్య, డ్రిప్ ఇరిగేషన్ కోఆర్డినేటింగ్ అధికారులు బి.అశోక్ ప్రసాద్ బాబు రైతులు సోంలా నాయక్, ఎనబోతుల నర్సయ్య, సలుగు శ్రీను, మరాటి మల్లేశం, ఎల్. లక్ష్మణ్, రాము, బుగ్గయ్య, పులి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా డేటా ఆధారంగా యూరియా పంపిణీ

## 6 సొసైటీ కేంద్రాలలో ఒకే రోజు 80 టన్నుల యూరియా పంపిణీ



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశానుసారం రైతులకు రైతు భరోసా డేటా ప్రకారం ముందస్తు సమాచారంను సొసైటీల ద్వారా, వ్యవసాయ శాఖ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, స్థానిక సిబ్బంది ద్వారా సమాచారం అందించి గురువారం నెల్లికుదురు మండలంలో ఆరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల కేంద్రాలలో 80 మెట్రిక్ టన్నుల యూరియాను ఏకకాలంలో రైతులకు సక్రమంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమంలో జినుగు మరియన్న జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి, తహసిల్దార్ సీహెచ్. నరేష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమార్, ఎస్ఐ. రమేష్, సమస్త వ్యవసాయ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పదవి యాదవులకు కేటాయించాలి

## అఖిలభారతయాదవ యువజన విభాగం జిల్లా కార్యదర్శి



వెంకటాపూర్, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయం ట్రస్ట్ బోర్డ్ కు చైర్మన్ గా యాదవులను నియమించాలని అఖిల భారత యాదవ యువజన విభాగం ములుగు జిల్లా కార్యదర్శి మెర్రి రాజుయాదవ్ ప్రభుత్వం, అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో యాదవసంఘము సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాకతీయులు నిర్మించిన రామప్ప దేవాలయం కట్టడం వెనుక యాదవుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఎలాంటి శాసనాలు చూసిన గుడి నిర్మాణ సమయంలో యాదవుల పాత్ర చాలా కీలకమనేది తెలుస్తుందని పేర్కొన్నారు. అందుకోసమే యాదవ సామాజిక వర్గానికి రామప్ప ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవీ కేటాయించాలని కోరటం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా కొమురవెల్లి మల్లన్న, ఐనవోలు మల్లన్న టెంపుల్స్ కి కూడా ఆలయ కమిటీ చైర్మన్ గా యాదవులను కేటాయించాలని ఆయన కోరారు. వివిధ పార్టీలు యాదవులను కేవలం ఓటు బ్యాంకు గానే చూడకుండా తమతమ పార్టీలలో పనిచేస్తున్న యాదవులకు సముచిత స్థానాలు కల్పించాలని ఆయన కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ్ సంఘం జిల్లా నాయకులు మేర్గు రాజుయాదవ్,పెంటశ్రీనివాస్ మేరుగు శ్రీను, ఇమ్మడి ప్రవీణ్, బోయిని సాంబయ్య, కొమ్ము అశోక్, యువజనసంఘం నాయకులు ఇమ్మడినరేష్, బోయినిరంజిత్, నన్నబోయిన శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి నిధులు ఆపడం లేదు

**మెట్రో విస్తరణపై స్పష్టతనిచ్చిన కిషన్ రెడ్డి**
**జాతీయ రహదారులపై గడ్కరీతో చర్చ**
**తెలంగాణలో డబుల్ అయిన జాతీయ రహదారులు**
**రూ.30 వేల కోట్లకు పైగా గ్రీన్ సిగ్నల్**
**కొత్త ప్రాజెక్టుల వివరాలు వెల్లడి**
**ప్రభుత్వంపై విమర్శలు**
**రేవంత్, కేటీఆర్‌కు కౌంటర్**
**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వాఖ్యలు**



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో మెట్రో విస్తరణను కేంద్రం ఆపడం లేదని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఈ మేరకు తెలంగాణలో జాతీయ రహదారుల ప్రాజెక్టుల అభివృద్ధి గురించి చర్చించారు. రాష్ట్రంలో కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రాజెక్టుల విస్తరణపై చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలోనే ఆయన న్యూ ఢిల్లీలోని బీజేపీ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులు అత్యంత వేగవంతంగా సమర్థవంతంగా పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2015 వరకు రాష్ట్రంలో 2500 కిలో మీటర్ల జాతీయ రహదారులు ఉండేవని తెలిపారు. ఈ పదేళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణం డబుల్ అయిందని, సుమారు 5 వేల కిలోమీటర్లకు పైగా ఇప్పటికే పూర్తి అయిందని చెప్పారు. దేశ అభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర చాలా కీలకం గా ఉందన్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలలో నేషనల్ హైవేలకు అనుసందానం జరుగుతోందని, 31 జిల్లాలలో పూర్తి కూడా అయినట్లు క్లారిటీ ఇచ్చారు. దీంతో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా హైవేలపై రోడ్ సేఫ్టీ పెరిగిందన్నారు. నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి సుమారు రూ.30 వేల కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఇందులో కరీంనగర్‌లో మహదేవ్ పూర్ నుంచి సిరోచ వరకు 17 కిలోమీటర్ల రోడ్డు రూ.163 కోట్లతో చేపట్టనున్నట్లు తెలిపారు. నల్గొండలో గౌరెల్లి నుంచి వలిగొండ వరకు 42 కిలోమీటర్ల రోడ్డు రూ.690 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే నకిరేకల్ నుంచి నాగార్జున సాగర్ వరకు 14 కిలోమీటర్ల రోడ్డు రూ.516 కోట్లతో నిర్మాణం, తెలంగాణ ఏపీకి అనుసందానం చేసే కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి సుమారు రూ.1082 కోట్లతో బ్రిడ్జి రానున్నట్లు చెప్పారు. ఈ బ్రిడ్జికి కనెక్టివిటీ కోసం రూ.430 కోట్లతో 13 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం మంజూరు అయిందని తెలిపారు. వరంగల్ తొర్రూర్ నుంచి నెహ్రూ నగర్ వరకు రూ.674 కోట్లతో 69 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఇలా రాష్ట్రంలో రానున్న రోజుల్లో హైవేల నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి చెప్పినట్లు వెల్లడించారు. 27 ప్రాజెక్టులు డీపీఆర్ స్టేజీలో ఉన్నాయని అన్నారు. తెలంగాణ మేలు కోరుకునే వ్యక్తుల్లో నేను ముందుంటా అని సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఆధారాలు లేకుండా అర్థం లేని వ్యాఖ్యలు మాట్లాడొద్దని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కి బీజేపీ ఫోబియా పట్టుకుందని విమర్శించారు. నేపాల్‌లో జరిగిన హింస భారత్‌లో జరుగుతుందని, కేటీఆర్ వ్యాఖ్యానించడం దేశద్రోహమే అని కిషన్‌రెడ్డి తప్పుబట్టారు.

# బీఆర్ఎస్‌కు కొత్త టెన్షన్లు




**కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ ప్రాథమిక విచారణ షురూ**
**కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సీబీఐ దృష్టి**
**రికార్డుల పరిశీలనలో అధికారులు**
**కేసీఆర్ నిర్ణయాలపై ఘోష్ కమిషన్ ఫోకస్..**

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో సెన్సేషనల్ క్రియేట్ చేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ ప్రాథమిక విచారణను గురువారం ప్రారంభించింది. ఈ ప్రాజెక్టులో అవకతవకలు, నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేయాలని తెలంగాణ ప్రభుత్వం సీబీఐని కోరింది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం అంశంపై సీబీఐ ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఈ కేసుకు సంబంధించిన ప్రాథమిక వివరాలను సేకరిస్తోంది. కేసుకు విచారణ అర్హత ఉందో తేల్చేందుకు సీబీఐ అధికారులు రికార్డులను పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా ఎన్డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాథమిక విచారణ అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు.

**బీఆర్ఎస్‌కు కొత్త కష్టాలు:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సీబీఐ ఎంట్రీ ఇవ్వడం బీఆర్ఎస్‌కు కొత్త కష్టాలు తప్పవా అనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఇప్పటికే విచారణ జరిపిన పీసీ ఘోష్ కమిషన్ కాళేశ్వరం పాపం అంతా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దేనని ప్రభుత్వానికి నివేదించింది. బ్యారేజీల కుంగుబాటు, రాష్ట్ర ఖజానాకు నష్టం కలగడంలో కేసీఆర్ సొంత నిర్ణయాలే కారణం అని ఘోష్ కమిషన్ తేల్చింది. ఈ నేపథ్యంలో గులాబీ బాస్ కేసీఆర్‌ను సీబీఐ అధికారులు విచారించే అవకాశాలు ఉన్నాయి. కేసు దర్యాప్తు క్రమంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయనేది బీఆర్ఎస్ వర్గాల్లో టెన్షన్ నెలకొంది.

# బంజార, లంబాడీ సోదరులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి**



భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుందూరుపల్లి గ్రామంలో లంబాడీ సోదర సోదరీమణులు బంధు మిత్రులతో కలిసి ఎంతో ఘనంగా నిర్వహించుకునే తీజ్ పండుగ కార్యక్రమంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సద్దుల బతుకమ్మ పండుగకి ముందే ప్రతి గిరిజన తండాలో, ప్రతి గ్రామంలో ఎంతో భక్తి శ్రద్దలతో ఈ తీజ్ పండుగ జరుపుకుంటారు. బంధు మిత్రులంతా, కలిసి వారి యొక్క సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తూ జరుపుకునే తీజ్ పండుగ కార్యక్రమానికి నన్ను కూడా ఒక్క కుటుంబ సభ్యుడిగా ఆహ్వానించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక, కృతజ్ఞతలు తెలిపారు.

## మల్లంపల్లి ఎర్రమట్టిలో మెరిసిన ఆణిముత్యం

**డీఎస్పి గా ఎంపికైన మౌనిక**



మల్లంపల్లి, సెప్టెంబర్ 25:(తీన్మార్ న్యూస్): TGPSC బోర్డ్ ప్రకటించిన గ్రూప్ వన్ ఫలితాల్లో మల్లంపల్లికి చెందిన అల్లెపు సమ్మయ్య సరోజనల కూతురు అల్లెపు మౌనిక డి.ఎస్.పి గా ఎంపికయ్యారు. బలహీన వర్గం పేద కుటుంబం నుండి మౌనిక గ్రూప్ వన్ స్థాయి ఉద్యోగాన్ని సాధించినందుకు మల్లంపల్లి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం రోజున మల్లంపల్లి ప్రజా సంఘాల నాయకులు మౌనికను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌనిక కృషి ఆదర్శనీయం, అభినందనీయం అన్నారు. నేటి యువతకు ఆదర్శనీయంగా మౌనిక నిలిచిందని, జీవితంలో చదువును మించిన ఆయుధం లేదని, పేద కుటుంబంలో పుట్టి అకుంఠిత దీక్షతో మౌనిక అత్యున్నత స్థానాన్ని సాధించడం గొప్ప విషయం అన్నారు. పేద కుటుంబమైనప్పటికీ కూతుర్ని చదివించడానికి ఎనలేని కృషి చేసి ప్రోత్సహించిన తల్లిదండ్రులు కల నెరవేరిందన్నారు. గురువులకు మరియు జేడీ మల్లంపల్లి మండలానికి ములుగు జిల్లా కు పేరు తేవడం మల్లంపల్లి ప్రజలకూ గర్వంగా ఉందన్నారు. గ్రామంలో ఉన్న యువతీ, యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోల్కొండ రాజు, చిదర సంతోష్, మొగ్రి రాజుయాదవ్, పొనుగంటి రవి, కానుగంటి సతీష్, కుక్కల సంపత్, ఎస్ ఆర్ రాజు, ఎడ్ల అనీల్ రెడ్డీ, గోల్లెన సంతోష్, భూపతి మధు, మహ్మద్ బాబుల్, జింక వేణు తదితరులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి



పరకాల, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని దామెర చెరువు వద్ద జరుగనున్న సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అవసరమైన అన్ని సౌకర్యాలను సమయానికి అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఉత్సవం కావున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఇంటర్‌లో కొత్త సిలబస్




హైదరాబాద్, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌లో కొత్త సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. నందన్ నిలేకని ఏక్ స్టెప్ ఫౌండేషన్‌తో ఏఐ క్లాసులు నిర్వహించేలా ఎంఓయూ చేసుకున్నట్టు, ఇంటర్ విద్యార్థులకు నీట్, జేఈఈ, క్లాట్ పరీక్షలకు ఫిజిక్స్ వాలా కోచింగ్ అందించనున్నట్టు చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 494 అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆర్థిక ఆమోదం కోసం ఎదురుచూస్తున్నామని, త్వరలోనే వీటికి ఆమోదం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన ఇంటర్ బోర్డు కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌లో పలు అంశాలను ప్రస్తావించారు. ఇంటర్ విద్య బలోపేతానికి సీఎం సూచనలు, ఇంటర్ బోర్డు అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ స్కూళ్ల మాదిరిగానే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ విద్యార్థులకు మిడ్డే మీల్స్, యూనిఫామ్స్ అందించేలా ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోందన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాలల్లో 5500 సీసీ కెమెరాల ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు వెల్లడించారు. నవంబర్ తర్వాత ఏఐ క్లాసులకు సంబంధించి స్క్రీన్లను కాలేజీలకు అందజేయనున్నట్టు చెప్పారు. విద్యార్థుల హాజరుశాతం పెంపునకు ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)ని మరింత పటిష్టంగా అమలు చేయనున్నట్టు తెలిపారు. విద్యార్థులు గైర్హాజరైతే వారి తల్లిదండ్రులకు వెంటనే సమాచారం పంపిస్తామని, విద్యార్థులు ఎందుకు రాలేదో ప్రిన్సిపాళ్లు తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుంటారన్నారు. దసరా తర్వాత ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని భావిస్తున్నట్టు వివరించారు. నేటి నుంచి అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్‌లను నిర్వహిస్తామన్నారు. ఒక కాలేజీలో ఇంటర్ చదివి మంచి స్థానానికి ఎదిగిన విద్యార్థితో జూనియర్ విద్యార్థులకు ఇంటరాక్షన్ సెషన్‌లను నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి చెప్పారు.

**ప్రతి జిల్లాకు సోషల్ మీడియా సెల్**

ఇంటర్ బోర్డుకు సంబంధించిన సమాచారాన్ని, విద్యార్థులకు అవసరమైన అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు అందించడానికి ప్రతి జిల్లాలో ఒక సోషల్ మీడియా సెల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బోర్డు కార్యదర్శి చెప్పారు. అలాగే సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ఇంటర్ ప్రాక్టికల్ నిర్వహించాలని, ప్రయివేటు కాలేజీలు కూడా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానం ఉండదని స్పష్టం చేశారు.

# కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు ప్రారంభం

**ఈ మేరకు కీలక మార్గదర్శకాలు జారీ**
**అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ**
**అక్టోబర్ 23న డ్రా పద్ధతిలో దుకాణాల కేటాయింపు**
**గౌడ్, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు**
**బకాయిలున్నవారు అనర్హులు**
**బార్లలో బీర్ల తయారీ లైసెన్స్ కు నేడే చివరి తేదీ**



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 25 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కొత్త మద్యం దుకాణాలకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలుకాబోతోంది. రెండేళ్ల కాలపరిమితికి (2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు) అనుమతుల కోసం ఇప్పటికే ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేయగా ఈ నోటిఫికేషన్ కు అనుబంధంగా గురువారం మద్యం దుకాణాల కేటాయింపు, షెడ్యూల్‌కు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసింది. కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుం రూ.3 లక్షలుగా నిర్ధరించారు. నేటి నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అక్టోబర్ 23వ తేదీన డ్రా పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయిస్తారు. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం శిక్ష పడిన వారు, ప్రభుత్వానికి బకాయిలు పడి సక్రమంగా చెల్లింపులు చేయని వారు మద్యం దుకాణాలు పొందేందుకు అనర్హులుగా ప్రకటించారు. దుకాణాల కేటాయింపుల్లో గౌడ్, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించనున్నారు. ఈమేరకు రిజర్వేషన్ దరఖాస్తుదారులు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి జతచేయవల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం కొనసాగుతున్న మద్యం దుకాణాల లైసెన్స్‌లు ఈ ఏడాది నవంబర్ చివర వరకు గడువు ఉంది.

**బార్లలో బీర్ల తయారీ లైసెన్స్ కు నేడే ఆఖరు తేదీ:**

హెూటల్ లేదా రెస్టారెంట్లలోనే బీర్లు తయారు చేసి విక్రయించేందుకు తెలంగాణ ఆబ్కారీ శాఖ లైసెన్స్‌లు జారీ చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రూవరీ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించిన లైసెన్స్ కోసం దరఖాస్తులకు ఇవాల్టితో ఆఖరు గడువు ముగియనుంది. 2బి బార్లు, ఎలైట్ బార్లు, సీ1-క్లబ్, టిడి1, టీడీ2 లాంటి లైసెన్స్ కలిగిన హెూటల్, రెస్టారెంట్లలో మైక్రో బ్రూవరీ యూనిట్లు ఏర్పాటు కోసం రూ. 1 లక్ష రుసుముతో దరఖాస్తులను అబ్కారీ శాఖ ఆహ్వానించింది. ఈ దరఖాస్తులకు ఇవాల్టితో గడువు ముగియనుంది. పూర్తి వివరాలకు tgbcl.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

## హామీల అమలు డిమాండ్ నేపథ్యంలో
# “అంగన్‌వాడీల అరెస్ట్”



మొదటి పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే వారు సెక్రటేరియట్ ముట్టడికి వెళ్లగా పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలోనే అంగన్‌వాడీల అరెస్ట్‌ను మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా స్పందించారు. తమ సమస్యల పరిష్కారం కోసం చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి, కర్కషంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామంటూ బీరాలు పలికిన రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో వారిని ఎక్కడిక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడం సిగ్గుచేటన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఉద్యోగులకు గౌరవం లేదా గుర్తింపు లేదా? ప్రజా పాలన అని రాక్షస పాలన కొనసాగిస్తారా అని ప్రశ్నించారు. ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ సంబురం లేకుండా చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి కి వారి ఉసురు తగులుతుందని అన్నారు. అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారు వర్కర్లు కాదని, అంగన్ వాడీ టీచర్లు అని పోస్టును ఉన్నతీకరించారని హరీశ్ రావు గుర్తు చేశారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, సహాయకులకు రూ.2,200 వేతనం లభించేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.13,650లకు, మినీ అంగన్ వాడీ టీచర్ల వేతనాన్నిరూ.7,800లకు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800 లకు పెంచి దేశంలోనే అత్యధిక వేతనాలు చెల్లించిన రాష్ట్రంగా తెలంగాణ నిలించిందన్నారు. అభయహస్తం పేరిట కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని 18 వేలకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించారని తెలిపారు. మాయమాటలు చెప్పి 22 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీగతీ లేదన్నారు. మహాలక్ష్మి పేరిట మీరు అమలు చేస్తున్న ఉచిత బస్సుల్లోనే జిల్లాల నుంచి సచివాలయం వద్దకు వచ్చి మిమ్మల్ని నిలదీస్తున్నారని అన్నారు. మీ మోసపూరిత వైఖరి పట్ల అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కామెంట్ చేశారు. అరెస్ట్ చేసిన అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్ రావు అన్నారు.

# దేశ రక్షణ రక్షణరంగ మరింత బలోపేతం

- బ్రహ్మోస్ మిస్సైళ్లు, ఇతర ఆయుధ వ్యవస్థల తయారీ
- ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** ఉత్తర్ ప్రదేశ్‌లో భారత రక్షణరంగ ఉత్పత్తుల్ని మరింత బలోపేతం చేస్తూ రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. గురువారం ఉత్తర్ ప్రదేశ్ లోని నోయిడాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన సందర్భంగా మాట్లాడిన మోదీ.. భారత సైన్యం స్వయం సమృద్ధి (ఆత్మనిర్భర్) లక్ష్యంతో విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ‘మన సైన్యం స్వయం సమృద్ధిని సాధించాలని, విదేశీ మూలాలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ఆశిస్తోంది. ఈ లక్ష్యానికి, భారతదేశంలో బలమైన రక్షణ మౌలిక సదు-



పాయాలను అభివృద్ధి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాం. ప్రతి ఉత్పత్తి ‘మేడ్ ఇన్ ఇండియా’గా ఉండాలని నొక్కి చెబుతున్నాం. దీనికి మద్దతుగా, ఉత్తర్ ప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తోంది. రష్యా సహాయంతో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలో రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుంది’ అని పీఎం మోదీ చెప్పారు. ఉత్తర్ ప్రదేశ్‌లో డిఫెన్స్ కారిడార్ అభివృద్ధి చేస్తున్నామని.. ఇక్కడ బ్రహ్మోస్ మిస్సైళ్లు, ఇతర ఆయుధ వ్యవస్థల తయారీ ఇప్పటికే జరుగుతోందని మోదీ చెప్పారు. ఇందులో భాగంగానే, ‘అల్టిమేట్ సోర్సింగ్ బిగిన్స్ హియర్’ అనే థీమ్‌తో సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఇది ఆవిష్కరణ, సమైక్యత, అంతర్జాతీయీకరణపై దృష్టిపెడుతూ.. విదేశీ కొనుగోలుదారులు, దేశీయ కొనుగోలుదారులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వైవిధ్యమైన, ఆధునిక పరిశ్రమలు, కొత్త ఆర్థికవ్యవస్థలను సృష్టించబోతున్నాయని మోదీ అన్నారు. ఈ అభివృద్ధి భారత రక్షణ రంగంలో స్వదేశీ తత్వాన్ని బలపరుస్తూ, ఉత్తర్ ప్రదేశ్‌ను డిఫెన్స్ హబ్‌గా మార్చనుందని ప్రధాని చెప్పారు. దేశ ఆర్థిక, రక్షణ లక్ష్యాలకు ఇది మరో మైలురాయిగా మోదీ అభివర్ణించారు.

# హైడ్రోజనే భవిష్యత్తు ఇంధనం

**కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పూరీ**

**పాట్నా: సెప్టెంబర్25 :** హైడ్రోజన్ భవిష్యత్ ఇంధనమని కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ ఇంధనం ప్రాముఖ్యతను మరోసారి నొక్కి చెప్పారు. ఇంధన భద్రత, ఆర్థిక పోటీతత్వం, పర్యావరణ బాధ్యతకు కీలకమైన స్తంభంగా పేర్కొన్నారు. 2030 నాటికి భారత్ ఏటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని కేంద్రమంత్రి చెప్పారు. దీనికి బలమైన పాలసీతో పాటు రూ.19,700 కోట్ల విలువైన ఉత్పత్తి-సంబంధిత ప్రోత్సాహక పథకం మద్దతు ఇస్తుందని తెలిపారు. బయోఫ్యూయల్ బ్లెండింగ్‌ను స్వీకరించడం ద్వారా సాధించిన విసయాలపై ఆయన స్పందించారు. 2020 నాటికి 10శాతం బయోఫ్యూయల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని.. తాము ఐదునెలల ముందుగానే లక్ష్యాన్ని సాధించామన్నారు. అప్పుడు 20శాతం బయోఫ్యూయల్ బ్లెండింగ్‌ని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయన్న ఆయన.. తొలి లక్ష్యాన్ని ఐదునెలల ముందుగానే సాధిస్తే.. రెండో లక్ష్యాన్ని ఆరేళ్ల ముందుగానే సాధించామన్నారు. పానిపట్‌లోని ఇండియన్ ఆయిల్ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, విశాఖపట్నంలో టోక్యో ఎనర్జీ బిడ్‌లను ఉటంకిస్తూ.. భారత్‌లో హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చులు ఎలా క్రమంగా తగ్గుతున్నాయో మంత్రి వివరించారు. ఇది పెరుగుతున్న పెట్టుబడిదారుల విశ్వాసమని.. సాంకేతిక పరిపక్వతకు సంకేతంగా పేర్కొన్నారు. ఇండియన్ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్.. గ్రీన్



అమ్మోనియా టెండర్లను సైతం హెలెట్ చేశారు. సహజ వాయువు కంటే లాజిస్టికల్ ప్రయోజనాలను బట్టి గ్రీన్ అమ్మోనియాను ముఖ్యమైన ఎగుమతి అవకాశంగా మంత్రి అభివర్ణించారు. కేంద్ర మంత్రివర్గం జనవరి 4, 2023న రూ.19,744 కోట్ల వ్యయంతో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ఆమోదించింది.

# నిరుద్యోగ యువత ర్యాలీ




**ఖమ్మం,సెప్టెంబర్25 :** జిల్లా కేంద్రంలో నిరుద్యోగ యువత కదం తొక్కారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, యూత్ డిక్లరేషన్, రెండు లక్షల ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని నినాదాలు చేశారు. దీంతో ఖమ్మం వీధులు నిరుద్యోగుల నినాదాలతో మార్మోగిపోయాయి. ఖమ్మం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొన్న మానుకోటలో, ఈ రోజు ఖమ్మంలో నిరుద్యోగ యువత రోడ్డెక్కిన తీరు చూస్తుంటే రేవంత్ రెడ్డి ఉద్యోగం త్వరలో ఊడిపోవడం ఖాయమనిపించిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఓట్ చోరీ జరిగిందని దేశమంతా ప్రచారం చేస్తున్నారు. కానీ, అసలైన ఓట్ చోరీ తెలంగాణలో జరిగింది అదే నిరుద్యోగు యువత ఓట్ల చోరీ అని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 10 ఏళ్లు అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీ ఎక్కడ అధికారం పోతుందేమో అన్న భయంతో నోటికొచ్చిన హామీ ఇచ్చింది. కానీ, తమకు ఉద్యోగాలు రాగానే నిరుద్యోగులను మరిచిపోయారు. ఎన్నికల్లో ప్రచార సామగ్రిని ఎలా వాడుకొని వదిలేస్తారో అలాగే నిరుద్యోగులను సైతం ప్రచారానికి బస్సు యాత్రలకు వాడుకొని వదిలేశారు. గ్రూప్ -1 ఉద్యోగాల రూపంలో తెలంగాణ ఉద్యోగాల చోరీ కూడా బట్టబయలు అయింది. ఇప్పుడు ఆ ఓట్ల చోరీని కప్పిపుచ్చుకోవడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్ముతో నిరుద్యోగులను ఓడించడానికి లాయర్లకు కోట్లు- ఖర్చు చేస్తుంది అని రాకేశ్ రెడ్డి ఆరోపించారు.

# మాజీ సీఎం కుమారుడి అరెస్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్25:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కొడుకు చైతన్య బఘేల్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో అంటి కరప్షన్ బ్యూరో , ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ సెప్టెంబర్ 24, బుధవారం చైతన్యతో పాటు మరో వ్యక్తి దీపెన్ చావ్డాను కూడా అదుపులోకి తీసుకున్నాయి. ఇద్దరినీ ప్రత్యేక ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ కోర్టులో హాజరుపరిచారు, అక్టోబర్ 6 వరకు వారిని ఏసీబీ/ఈఓడబ్ల్యూ కస్టడీకి అప్పగించారు. 2019 నుంచి 2022 వరకు భూపేశ్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ లిక్కర్ స్కామ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కామ్ విలువ దాదాపు 2,500 కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకారం, చైతన్య బఘేల్ ఈ స్కామ్‌లో కీలక పాత్ర పోషించారు. ఈ కుంభకోణంలో సుమారు 1,000 కోట్ల రూపాయల అక్రమ ఆదాయాన్ని చైతన్య నిర్వహించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. అక్రమ నిధులను దాచడానికి, బదిలీ చేయడానికి ఇతర సభ్యులతో కలిసి కుట్ర పన్నినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కామ్‌లో మద్యం అమ్మకాల నుంచి కమీషన్లు, చట్టవిరుద్ధమైన మద్యం అమ్మకాల ఆదాయం, రాష్ట్రంలో లాభదాయకమైన మద్యం వ్యాపారాన్ని నియంత్రించేందుకు డిస్టిలర్లతో కుమ్మక్కై లంచాలు తీసుకోవడం వంటివి ఉన్నాయి. చైతన్య బఘేల్ తరపు న్యాయవాది ఫైసల్ రిజ్వీ ఈ అరెస్ట్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. చైతన్యపై ఎలాంటి ఆధారాలు లేకుండానే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఏసీబీ/ఈఓడబ్ల్యూ దాఖలు చేసిన ప్రధాన చార్జ్‌షీట్ ఆ తర్వాత సమర్పించిన అనుబంధ చార్జ్‌షీట్‌లలో చైతన్య పేరు నిందితుడిగా లేదని ఆయన స్పష్టం చేశారు. 45 మంది నిందితుల్లో 29 మందిని ఎప్పుడూ అరెస్ట్ చేయలేదని, ఎందుకు చైతన్యను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ప్రశ్నించారు. మరో నిందితుడు లక్ష్మీ నారాయణ్ బన్సాల్ ఇచ్చిన వాంగ్మూలంలోనే చైతన్య పేరు వచ్చిందని రిజ్వీ తెలిపారు

# ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన నాగార్జున

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** దేశ రాజధాని ఢిల్లీ హైకోర్టును టాలీవుడ్ ప్రముఖ నటుడు, హీరో అక్కినేని నాగార్జున ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా.. తన ఫోటోతోపాటు తన పేరును వాడుకోకుండ నిషేధం విధించాలంటూ ఢిల్లీ హైకోర్టులో హీరో నాగార్జున పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్ తేజస్ కారియా విచారించారు. పర్సనాల్టీ రైట్స్ కోసం గతంలో బాలీవుడ్ హీరోహీరోయిన్లు అమితాబ్ బచ్చన్, ఐశ్వర్య, అభిషేక్ బచ్చన్, అనిల్ కపూర్ తదితరులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. సినీనటుల అనుమతి లేకుండా వారి పేరును వాడుకోవద్దంటూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన సంగతి




తెలిసిందే. ఈ నేపథ్యంలో హీరో నాగార్జున ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

## సాహితీ ఇన్‌ఫ్రా కేసులో
# ఈడీ విచారణ

**విచారణకు హాజరైన నటుడు జగపతిబాబు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** నటుడు జగపతిబాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట హాజరయ్యారు. జగపతి బాబుని నాలుగు గంటలపాటు- ఈడీ అధికారులు విచారించినట్లు- సమాచారం. సాహితీ ఇన్‌ఫ్రా కేసులో ఆయన్ను ఈడీ విచారణకు పిలిచింది. సాహితీ తరఫున పలు ప్రకటనలో నటించిన జగపతిబాబుకు, సాహితీ కంపెనీకి మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయన్న ఆరోపణల మధ్య ఈడీ విచారించింది. సాహితీ లక్ష్మినారాయణ కంపెనీ అకౌంట్‌లో నుంచి జగపతిబాబుకు నగదు బదిలీ అయినట్లు- గుర్తించినట్లు- అధికారులు తెలిపారు. పెద్ద మొత్తంలో డబ్బులు బదిలీ అయినందున ఆయన్ని పిలిచి విచారించినట్లు- వెల్లడించారు. జగపతిబాబుకు సాహితి నుంచి వచ్చిన డబ్బులకు సంబంధించి సమాచారం తెలుసు కున్నామని అధికారులు స్పష్టం చేశారు. సాహితీ ఇన్ఫా, ప్రీ లాంచింగ్ పేరుతో అపార్ట్‌మెంట్లు-, విల్లాల నిర్మాణం పేరిట కొనుగోలుదారుల నుంచి రూ.248.27కోట్ల మేర వసూలు చేసి, నిర్మాణాలు చేపట్టకుండా మోసానికి పాల్పడిందని ఈడీకి ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు సాహితీపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసి ఈడీ దర్యాప్తు చేసింది. సాహితీ నిర్వాహకులు రూ.126కోట్లు- కొనుగోలు దారుల నుంచి వసూలు చేసినట్టు- ఈడీ అధికారులు గుర్తించారు. ఆ డబ్బులతో పలు ఆస్తులను కొనుగోలు చేసినట్లు- చెప్పారు. ఈ మేరకు అధికారులు ఆస్తులను గుర్తించి జప్తు చేశారు. సాహితీ కేసులో మరింత లోతైన విచారణలో భారీఎత్తున స్కామ్ జరిగినట్లు- అధికారులు పేర్కొన్నారు. దీనిలో భాగంగానే సాహితీ ఇన్ఫాక్రు ప్రకటనలు చేసిన నటినటు-లను ఈడీ విచారిస్తోంది.



# గుమ్మడికాయ.. ఎన్నో పోషకాలు..!

భారతీయులు ఎంతో పురాతన కాలం నుంచి గుమ్మడికాయలను ఆహారంగా తింటున్నారు. వీటితో స్వీట్లు లేదా కూరలు చేస్తుంటారు. గుమ్మడికాయ ఎంతో రుచిగా ఉంటుంది. గుమ్మడికాయ, బెల్లం కలిపి చేసే కూరను చాలా మంది ఇష్టంగా తింటారు. అయితే ఆయుర్వేద ప్రకారం గుమ్మడికాయ మనకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. గుమ్మడికాయను తింటే అనేక పోషకాలు లభిస్తాయి. ఇందులో అనేక విటమిన్లు, మినరల్స్, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు వచ్చే అనేక వ్యాధులను నయం చేస్తాయి. గుమ్మడికాయలను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఎన్నో లాభాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

**కంటి ఆరోగ్యానికి..**

గుమ్మడికాయల్లో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. అందువల్లే ఇవి చూడచక్కని నారింజ రంగులో ఉంటాయి. బీటా కెరోటిన్ మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. విటమిన్ ఎ వల్ల కంటి చూపు మెరుగు పడుతుంది. రేచీకటి సమస్య తగ్గుతుంది. గుమ్మడికాయల్లో లుటీన్, జియాజాంతిన్ అనే పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. ఇవి కళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయం చేస్తాయి. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో శుక్లాలు రాకుండా చూస్తాయి. దీని వల్ల వృద్ధాప్యంలోనూ కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. గుమ్మడికాయల్లో విటమిన్ సి, ఎ అధికంగా ఉండడం వల్ల మన శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. శరీరంలో తెల్ల రక్త కణాలు, యాంటీ బాడీలు ఉత్పత్తి అవుతాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. జీర్ణాశయం, పేగుల గోడలను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో సూక్ష్మ క్రిముల నుంచి రక్షణ లభిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..**

గుమ్మడికాయల్లో ఫైబర్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లుఅధికంగా ఉండడం వల్ల ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ కాయల్లో ఉండే ఫైబర్ మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. పొటాషియం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్ల వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. దీంతో గుండె జబ్బులు రాకుండా నివారించవచ్చు. గుమ్మడికాయల్లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ రెండింటి కాంబినేషన్ వల్ల గుమ్మడికాయలను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. గుమ్మడికాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని సంరక్షిస్తాయి. దీని వల్ల సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి రక్షణ లభిస్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు.

**షుగర్ లెవల్స్ ఉన్నవారికి..**

గుమ్మడికాయల్లో ఉండే ఫైబర్ వల్ల మనం తిన్న ఆహారంలో ఉండే పిండి పదార్థాలు రక్తంలో నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. గుమ్మడికాయల్లో అధికంగా ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇక ఒక కప్పు ఉడకబెట్టిన గుమ్మడికాయలను తినడం వల్ల సుమారుగా 49 క్యాలరీల శక్తి లభిస్తుంది. 12 గ్రాముల పిండి పదార్థాలు, 3 గ్రాముల ఫైబర్, 2 గ్రాముల ప్రోటీన్లు, 0.2 గ్రాముల కొవ్వులు లభిస్తాయి. గుమ్మడికాయలను తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ ఎ లో దాదాపుగా 200 శాతం వరకు అధికంగా లభిస్తుంది. విటమిన్ సి, పొటాషియం, విటమిన్ కె, ఐరన్, మెగ్నీషియం, ఫోలేట్, ఇతర బి విటమిన్లను కూడా మనం గుమ్మడికాయలతో పొందవచ్చు. దీని వల్ల పోషకాహార లోపం తగ్గుతుంది. ఇలా గుమ్మడికాయలను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# డెంగ్యూతో బాధపడుతున్నారా?

## ఈ డైట్ ప్లాన్ మీ కోసం.!




డెంగ్యూ అనేది డెంగ్యూ వైరస్ వల్ల వచ్చే, దోమకాటు ద్వారా వ్యాపించే ఒక వైరల్ వ్యాధి. దీని లక్షణాలు అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మపు దద్దుర్లు వంటివి ఉంటాయి. కొన్ని సందర్భాలలో, వ్యాధి తీవ్రంగా మారి రక్తస్రావం, అవయవాల వైఫల్యం వంటి ప్రాణాంతక పరిస్థితులకు దారితీయవచ్చు. డెంగ్యూకు నిర్దిష్ట చికిత్స లేదు, కాబట్టి లక్షణాల ఉపశమనానికి విశ్రాంతి తీసుకోవడం, ద్రవాలు ఎక్కువగా తీసుకోవడం, వైద్యుల సలహా మేరకు మందులు వాడటం ముఖ్యం. అంతేకాకుండా, ఈ సమయంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.

**ఏం తినాలి?**

డెంగ్యూ రోగులు ముందుగా హైడ్రేటెడ్‌గా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. కొబ్బరి నీళ్లు, గోరువెచ్చని నీరు, తాజా పండ్ల రసం, హెర్బల్ టీ తాగాలని చెబుతున్నారు. బొప్పాయి ఆకుల రసం ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచడంలో ప్రయోజనకరంగా ఉంటుంది. నారింజ, కివీస్, జామ, స్ట్రాబెర్రీ వంటి విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి. ఇన్ఫెక్షన్‌తో పోరాడటానికి సహాయపడతాయి. జీర్ణవ్యవస్థపై ఎక్కువ ఒత్తిడి పడకుండా ఉండటానికి గంజి, కిచిడి, కూరగాయల సూప్ వంటి తేలికపాటి భోజనం తినండి. ఆకుకూరలలో ఇనుము పుష్కలంగా ఉంటుంది. డెంగ్యూ సమయంలో కారంగా, ప్యాక్ చేసిన ఆహారాలను నివారించండి, ఎందుకంటే ఇవి శరీరాన్ని బలహీనపరుస్తాయి. తగినంత నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం డెంగ్యూ నుండి త్వరగా కోలుకోవడానికి సహాయపడుతుంది.

## ఈ లక్షణాలు మీలో కనిపిస్తున్నాయా..?

# అయితే హార్ట్ ఎటాక్ ముప్పు పొంచి ఉన్నట్లే..!



ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వారికి మాత్రమే వయో భారం వల్ల హార్ట్ ఎటాక్‌లు, ఇతర గుండె జబ్బులు వచ్చేవి. కానీ ఇప్పుడు యుక్త వయస్సులో ఉన్నవారు కూడా హార్ట్ ఎటాక్ బారిన పడుతున్నారు. అందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. అస్తవ్యస్తమైన జీవన విధానం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు, వేళకు భోజనం చేయకపోవడం, పౌష్టికాహారం తీసుకోకపోవడం, నూనె పదార్థాలు, ఇతర జంక్ ఫుడ్‌ను అధికంగా తినడం, శారీరక శ్రమ చేయకపోవడం, ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉండడం, నిద్ర సరిగ్గా పోకపోవడం వంటి అనేక కారణాల వల్ల చాలా మందికి హార్ట్ ఎటాక్స్ వస్తున్నాయి. అయితే హార్ట్ ఎటాక్ అనేది వాస్తవానికి ఒక మెడికల్ ఎమర్జెన్సీ. అందువల్ల ఇది వస్తేనే గానీ దీని లక్షణాలు ఎవరికీ తెలియవు. అయితే కొందరికి హార్ట్ ఎటాక్ వచ్చేందుకు కొన్ని రోజులు, నెలలు లేదా కొన్ని గంటల ముందు కూడా పలు లక్షణాలు, సంకేతాలు కనిపిస్తాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఛాతిలో తీవ్రమైన నొప్పి..**

హార్ట్ ఎటాక్ వచ్చే ముందు స్త్రీ, పురుషుల్లో లక్షణాలు ఒకే విధంగా ఉంటాయి. ఇవి లింగాన్ని బట్టి మారవు. కానీ వ్యక్తులను బట్టి మారుతాయి. కొన్ని లక్షణాలు కొందరిలో కనిపించకపోవచ్చు. కానీ కొన్ని లక్షణాలు మాత్రం అందరిలోనూ కామన్ గా కనిపిస్తాయి. అవేమిటంటే.. తీవ్రమైన ఆందోళన చెందడం, భారంగా ఉన్నట్లు అనిపించడం, ఛాతిపై బరువు పెట్టినట్లు అనిపించడం, ఛాతిలో తీవ్రమైన మంట లేదా నొప్పిగా ఉండడం వంటి లక్షణాలు తరచూ కనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలి. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా ముందుగానే అడ్డుకోవచ్చు. అలాగే హార్ట్ వచ్చిన వారికి లేదా రాబోతున్న వారికి తరచూ శరీరంలోని పలు భాగాల్లో నొప్పిగా ఉంటుంది. ముఖ్యంగా ఎడమ భుజం, మెడ, ఎడమ చేయి, వెన్నులో నడి మధ్యలో లేదా ఎడమ వైపు, ఎడమ దవడ, పొట్ట పై భాగంలో ఎడమ వైపు తరచూ నొప్పిగా ఉంటుంది. కొందరికి సూదుల్తో గుచ్చినట్లు కూడా అనిపిస్తుంది. ఇవన్నీ హార్ట్ ఎటాక్ కు సూచనలుగా భావించాలి. వీటిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

**తీవ్రమైన అలసట..**

హార్ట్ ఎటాక్ రాబోయే సమయంలో శ్వాస తీసుకోవడం తీవ్రంగా కష్టంగా మారుతుంది. ఛాతిలో పొడిచినట్లు నొప్పిగా కూడా అనిపిస్తుంది. ఒళ్లంతా చెమటలు పడుతుంటాయి. ఎంతలా అంటే చల్లని వాతావరణంలో ఫ్యాన్ లేదా ఏసీ కింద ఉన్నా సరే చెమటలు వస్తుంటాయి. ఇది హార్ట్ ఎటాక్‌కు కచ్చితంగా సూచనే అని గ్రహించాలి. అలాగే తరచూ వికారంగా, వాంతికి వచ్చినట్లు అనిపిస్తుంది. తలతిరిగినట్లు కూడా ఉంటుంది. తీవ్రంగా అలసటగా అనిపిస్తుంది. కొద్దిగా శారీరక శ్రమ చేసినా లేదా చిన్నపాటి నడక లేదా వ్యాయామం చేసినా, కొన్ని మెట్లు ఎక్కినా తీవ్రంగా అలసిపోయినట్లు ఫీలవుతారు. వీటన్నింటినీ హార్ట్ ఎటాక్‌కు సూచనలుగా భావించాల్సి ఉంటుంది.

**సైలెంట్ హార్ట్ ఎటాక్..**

ఇక కొందరిలో హార్ట్ ఎటాక్ సైలెంట్ కిల్లర్‌లా వస్తుంది. అంటే ఇది వచ్చే ముందు అసలు ఎలాంటి లక్షణాలు కనిపించవు. హఠాత్తుగా గుండె పోటు సంభవించి ఉన్న చోటనే కుప్పకూలిపోతారు. ఇలాంటి సందర్భాల్లో బతికే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. దీన్నే సైలెంట్ హార్ట్ ఎటాక్ అని కూడా అంటారు. కొన్ని రకాల వ్యాధులు ఉన్నవారికి ఇలా సైలెంట్ హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. డయాబెటిస్, హైబీపీ, అధికంగా కొలెస్ట్రాల్ ఉండడం వంటి వ్యాధులు ఉన్నవారికి సైలెంట్ హార్ట్ ఎటాక్ ముప్పు ఎక్కువగా ఉంటుంది. అలాగే కొందరు మితిమీరిన వ్యాయామం లేదా జిమ్ చేస్తారు. కొందరు పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాల్లో తీవ్రంగా డ్యాన్స్ చేస్తుంటారు. ఇక కొందరు తీవ్రమైన ఒత్తిడిలోనూ ఉంటారు. ఇలాంటి వారందరికీ సైలెంట్ హార్ట్ ఎటాక్ ముప్పు పొంచి ఉంటుంది. కనుక వీరు ఇంకా ఎక్కువ జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. హార్ట్ ఎటాక్ సంకేతాలను ముందుగానే గుర్తించడం లేదా హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు రోగిని వీలైనంత త్వరగా హాస్పిటల్‌కు తరలించడం వంటివి చేస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.

# డయాబెటిస్ ఉన్నవారు స్వీట్ కార్న్‌ను తినవచ్చా..?

## దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయి..?



సాధారణ మొక్కజొన్న మనకు కేవలం సీజన్‌లోనే లభిస్తుంది. కానీ స్వీట్ కార్న్ మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటుంది. స్వీట్ కార్న్‌ను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. దీన్ని ఎక్కువగా ఉడకబెట్టి తింటారు. అందులో కాస్త ఉప్పు, కారం చల్లి తింటే వచ్చే మజాయే వేరుగా ఉంటుంది. కొందరు స్వీట్ కార్న్ గింజల్లో కాస్త నెయ్యి కలిపి కూడా తింటారు. ఇది కూడా ఎంతో టేస్టీగా ఉంటుంది. అయితే స్వీట్ కార్న్‌ను తినడం వల్ల మనకు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి..? ఇందులో ఏయే పోషకాలు ఉంటాయి..? స్వీట్ కార్న్‌ను రోజూ తింటే ఎంత మెంత్తంలో తినాలి..? వంటి సందేహాలు చాలా మందికి వస్తుంటాయి. ఇక వీటిని నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. స్వీట్ కార్న్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇఇ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..**

స్వీట్ కార్న్ ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తుంది. అంటే దీన్ని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. స్వీట్ కార్న్‌లో కెరోటినాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి కంటి రెటీనాను సంరక్షిస్తాయి. డిజిటల్ తెరల నుంచి వెలువడే నీలి రంగు కిరణాల బారి నుంచి కళ్లను రక్షిస్తాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. స్వీట్ కార్న్ లో అధికంగా ఉండే ఫైబర్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. స్వీట్ కార్న్‌లోని పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల గుండె కండరాలు, రక్త నాళాల వాపులు తగ్గి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. స్వీట్ కార్న్‌లో ఫెరులిక్ యాసిడ్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా ఉంటాయి.

**డయాబెటిస్ ఉంటే..?**

స్వీట్ కార్న్ అంటే సహజంగానే చాలా మంది తియ్యగా ఉంటుందని, డయాబెటిస్ ఉన్నవారు తినకూడదని అనుకుంటారు. కానీ ఇందులో నిజం లేదు. ఎందుకంటే డయాబెటిస్ ఉన్నవారు సైతం స్వీట్ కార్న్‌ను తినవచ్చు. ఇందులో ఉండే ఫైబర్ వల్ల ఆహారంలోని పిండి పదార్థాలు త్వరగా గ్లూకోజ్ గా మారకుండా ఉంటాయి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు సైతం స్వీట్ కార్న్‌ను ఎలాంటి భయం లేకుండా తినవచ్చు. అయితే డయాబెటిస్ ఉన్నవారు స్వీట్ కార్న్ ను మోతాదులోనే తినాల్సి ఉంటుంది. ఇక ఆరోగ్యవంతులు స్వీట్ కార్న్‌ను రోజుకు ఒక కప్పు మోతాదులో తినవచ్చు. స్వీట్ కార్న్ గింజలను తీసి ఉడకబెట్టి కాస్త ఉప్పు, కారం చల్లి తినవచ్చు. మిరియాల పొడి చల్లి తింటే ఇంకా ఎంతో మేలు జరుగుతుంది. మీరు తినే సలాడ్స్‌లో ఈ గింజలను కలిపి కూడా తినవచ్చు. సూప్‌లలోనూ వేసి తీసుకోవచ్చు.

**పోషకాలు అధికం..**

ఒక మీడియం సైజ్ స్వీట్ కార్న్ దాదాపుగా 90 గ్రాముల గింజలను కలిగి ఉంటుంది. వీటిని పూర్తిగా తింటే 90 క్యాలరీల శక్తి లభిస్తుంది. పిండి పదార్థాలు 19 గ్రాములు, ఫైబర్ 2 గ్రాములు, చక్కెరలు 6 గ్రాములు, ప్రోటీన్లు 3 గ్రాములు, కొవ్వులు 1 గ్రాము ఉంటాయి. స్వీట్ కార్న్‌ను తింటే మనకు విటమిన్ సి అధికంగా లభిస్తుంది. ఒక స్వీట్ కార్న్‌ను పూర్తిగా తినడం వల్ల మనకు రోజుకు కావల్సిన విటమిన్ సి లో 7 మిల్లీగ్రాముల వరకు పొందవచ్చు. అలాగే పొటాషియం 243 మిల్లీగ్రాములు లభిస్తుంది. మెగ్నీషియం 33 మిల్లీగ్రాములు, విటమిన్ బి9 కూడా లభిస్తుంది. విటమిన్ బి9 వల్ల గర్భిణీలకు ఎంతో మేలు జరుగుతుంది. శిశువు ఎదుగుదలకు సహాయం చేస్తుంది. ఇలా స్వీట్ కార్న్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ కోసం జట్టు ప్రకటన




## రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్‌లకు దక్కని చోటు

అక్టోబరు నుంచి వెస్టిండీస్‌తో జరగనున్న టెస్టు సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జట్టును ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలో పనిచేసిన సెలెక్షన్ కమిటీ 15 మందితో టీమ్‌ను సమకూర్చింది. కానీ, ఇందులో రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ లేకపోవడం టీమ్‌ఇండియా ఫ్యాన్స్‌ను నిరాశకు గురిచేసింది.

రాబోయే వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త టీమ్‌ను ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ 15 మంది సభ్యుల జట్టును ప్రకటించారు. విండీస్ జట్టుతో జరగనున్న ఈ సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహిస్తాడు. గిల్ తొలిసారి స్వదేశంలో జరిగే టెస్టు సిరీస్‌కు కెప్టెన్ గా వ్యవహరిస్తున్నాడు. జూలైలో ఇంగ్లాండ్‌తో జరిగిన మాంచెస్టర్ టెస్ట్ సందర్భంగా కాలి బొటనవేలు గాయం నుంచి ఇంకా కోలుకోని కారణంగా వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ను జట్టులోకి తీసుకోలేదు. టెస్టు జట్టులో పంత్ లేకపోవడం ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. పంత్ ఉంటే టీమ్‌ఇండియా కష్టాల్లో ఉంటే ఆదుకునేవాడని టీమ్‌ఇండియా



ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. మరోవైపు ఐపీఎల్ లో అద్భుతంగా రాణించిన బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కూడా జట్టులోకి చేర్చుకోవడంపై పలు విమర్శలు తలెత్తుతున్నాయి. జట్టులో మిడిల్ ఆర్డర్ బలమైన వీరిద్దరూ లేని టీమ్‌ఇండియాను ఊహించడం కష్టమని వారి ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. 2025 ఆసియా కప్ ఫైనల్ ఆదివారం (సెప్టెంబర్ 28) దుబాయ్‌లో జరిగిన నాలుగు రోజుల తర్వాత అనగా అక్టోబర్ 2 నుండి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో సిరీస్ ఓపెనింగ్ మ్యాచ్ జరుగుతుంది. రెండవ టెస్ట్ మ్యాచ్ అక్టోబర్ 10న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ప్రారంభమవుతుంది.

**వెస్టిండీస్‌తో జరగనున్న ఈ టెస్టు సిరీస్‌కు బీసీసీఐ ప్రకటించిన జట్టు..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్, యశస్వి జైశ్వాల్, సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, ఎన్ జగదీశన్.

# అభిషేక్ సిక్సర్ల రికార్డు..




సూపర్ ఫామ్ లో ఉన్న భారత విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ తన ఖాతాలో మరో అరుదైన రికార్డును వేసుకున్నాడు. బుధవారం దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్ లో అద్భుతమైన అర్ధ సెంచరీ (37 బంతుల్లో 75, 6 ఫోర్లు, 5 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఈ క్రమంలో అసియాకప్ ఒక ఎడిషన్ లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్ గా కొత్త రికార్డును నెలకొల్పాడు. కేవలం 5 మ్యాచ్ ల్లోనే తను ఈ ఘనత సాధించడం విశేషం. గతంలో ఈ రికార్డు శ్రీలంకకు చెందిన ఓపెనర్ సనత్ జయసూర్య పేరిట ఉంది. 2008 ఎడిషన్ లో తను 14 సిక్సర్లు బాదడం విశేషం. అప్పుడు ఈ టోర్నీ వన్డే ఫార్మాట్ లో జరిగింది. టోర్నీ ఇప్పటివరకు 16 సిక్సర్లు బాదిన అభిషేక్.. బంగ్లాపై మ్యాచ్ లో ఐదు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. తన జోరుతో మైదానంలోని ప్రత్యర్థి బౌలర్లు చేష్టలుడిగి చూస్తూ ఉండి పోయారు. భారీ సిక్సర్లతో తన జోరును కొనసాగిస్తూ, కేవలం 25 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న అభిషేక్.. సెంచరీ సాధిస్తాడని అభిమానులు ఆశించారు. గత మ్యాచ్ లో కూడా 70ం స్కోరు చేసిన అభిషేక్.. ఈసారి కూడా ఫ్యాన్స్ ను నిరాశపరుస్తూ మళ్లీ 70ం స్కోరుపైనే ఔటయ్యాడు. అయితే ఈసారి రనౌట్ రూపంలో తను ఔటవడం అభిమానులను షాక్ కు గురిచేసింది. ఇక సూపర్-4లో శ్రీలంకతో చివరి లీగ్ మ్యాచ్ తోపాటు ఫైనల్ (అర్హత సాధించడం దాదాపు ఖాయమే) మ్యాచ్ ఉండటంతో తన సిక్సర్ల సంఖ్యను మరింత పెంచుకోవాలని శర్మ అభిమానులు కోరుకుంటున్నారు. ఈనెల 26న లంకతో, ఫైనల్ మ్యాచ్ ఈనెల 28న జరుగుతుంది. ఇక ఈ మ్యాచ్ లో గెలిస్తే ఫైనల్ బెర్తు సాధిస్తుందన్న అంచనాతో బరిలోకి దిగిన భారత్.. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసి, భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు చేసింది. నిజానికి ఇన్నింగ్స్ ఆరంభంలో అభిషేక్ చేసిన విధ్వంసంతో ఇండియా భారీ స్కోరు సాధిస్తుందని భావించినా, మిడిలార్డర్ విఫలం కావడంతో అనుకున్నదానికంటే చాలా తక్కువ స్కోరుకే పరిమితం అవ్వాల్సి వచ్చింది. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా (29 బంతుల్లో 38, 4 ఫోర్లు, ఒక సిక్సర్)తో సమయోచిత బ్యాటింగ్ తో జట్టుకు మంచి స్కోరును అందించే ప్రయత్నం చేశాడు. మరో ఓపెనర్ శుభమాన్ గిల్ (29) కూడా వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. ఇక బౌలర్లలో రిషాద్ హుస్సేన్ రెండు వికెట్లతో రాణించాడు. ముస్తాఫిజుర్ రహ్మాన్ టీ20ల్లో 150 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. దీంతో ఈ ఘనత సాధించిన తొలి బంగ్లా దేశీప్లేయర్ గా తను రికార్డులకెక్కాడు.

# ఆస్ట్రేలియా-ఏ జట్టుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్

## కెప్టెన్‌గా స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ ఎంపిక



ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇండియా-ఏ జట్టును బీసీసీఐ ప్రకటించింది. స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్‌ను ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా నియమిస్తున్నట్టు బీసీసీఐ వెల్లడించింది. శ్రేయస్ అయ్యర్ ఇండియా-ఏ జట్టుకు నాయకత్వం వహించనున్నారు. అంతకుముందు, ఆస్ట్రేలియా '%ూ%'తో జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లో కూడా శ్రేయస్ అయ్యర్ ఇండియా-ఏ కెప్టెన్‌గా వ్యవహరించారు. అయితే, రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి కొద్ది సమయం ముందు ఆయన ఆకస్మికంగా కెప్టెన్సీని వదులుకుని జట్టు నుంచి విడుదల కావడం చర్చనీయాంశమైంది. రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌కు ముందు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీని వదులుకోవడానికి ప్రధాన కారణం వెన్ను నొప్పి. గతంలో శస్త్రచికిత్స చేయించుకున్న శ్రేయస్ అయ్యర్.. మళ్లీ వెన్నులో కొద్దిగా పట్టేసినట్టు , బిగుసుకుపోయినట్టు అనిపిస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగానే ఆయన రెడ్ బాల్ క్రికెట్ నుంచి ఆరు నెలలు విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని ఆయన బీసీసీఐకి కూడా తెలియజేశారు. ఆరోగ్య సమస్య ఉన్నప్పటికీ.. ఇప్పుడు వన్డే సిరీస్‌కు సారథిగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

**మొదటి వన్డేకు ఇండియా జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుద్ధవీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, సిమర్‌జీత్ సింగ్.

**రెండు, మూడు వన్డేలకు ఇండియా జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్-కెప్టెన్), అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుద్ధవీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్.

**ఇరానీ కప్ కోసం 'రెస్ట్ ఆఫ్ ఇండియా' జట్టు:**

రజత్ పాటిదార్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఆర్యన్ జుయల్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్-కెప్టెన్), యశ్ ధుల్, షేక్ రషీద్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తనుష్ కోటియన్, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, ఆకాష్ దీప్, అన్షుల్ కంబోజ్, సారన్ష్ జైన్.

# పాకిస్థాన్ ఆటగాళ్లపై ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు







భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ లో అతిగా ప్రవర్తించిన ఆ ఇద్దరు పాక్ క్రికెటర్స్ పై భారత్ క్రికెట్ బోర్డు చర్యలకు ఉపక్రమించింది. ఈవిషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకెళ్లింది. ఈ-మెయిల్ రూపంలో ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు చేసింది. పాక్ ప్లేయర్లు హారిస్ రవూఫ్, ఫర్హాన్ నుంచి లిఖితపూర్వక వివరణ కోరే అవకాశం ఉంది. వారు ఇవ్వని పక్షంలో ఐసీసీ ఎలైట్ ప్యానెల్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ఎదుట వాదనలు వినిపించాల్సిన అవసరం ఉంది. భారత్‌తో మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ ఫర్హాన్ హాఫ్ సెంచరీ చేసిన తర్వాత గన్‌షాట్ చూపిస్తూ హావభావాలు ప్రదర్శించాడు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి చేష్టలకు పాల్పడటం విమర్శలకు దారితీసింది. తన సెలబ్రేషన్స్‌ను ఫర్హాన్ సమర్థించుకొనేందుకు ప్రయత్నించాడు. అప్పటికప్పుడు అలా సంబరాలు చేసుకున్నా..బయట ఎవరు ఏమనుకున్నా పట్టించుకోను అని వ్యాఖ్యానించాడు. హారిస్ రవూఫ్ ఏకంగా జెట్ ఫ్లైట్‌లు కూలినట్లు 6-0 అని సైగలు చూపించాడు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు చెందిన ఆరు ఫైటర్ జెట్ విమానాలను తమ సైన్యం కూల్చేసిందని పాక్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. దానిని గుర్తు చేసేలా హారిస్ చేష్టలు ఉన్నాయనేది ప్రధాన విమర్శ. ఇక భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్‌తో వాగ్వాదానికీ దిగాడు. ఇప్పటికే రిఫరీ విషయంలో అవమానాలు ఎదుర్కొన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భారత్‌పై అక్కసును మాత్రం వదలట్లేదు. టీమ్‌ఇండియా సారథి సూర్యకుమార్ యాదవ్‌పై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసింది. గ్రూప్ స్టేజ్‌లో పాక్‌పై భారత్ విజయం సాధించింది. ఆ గెలుపును పహల్గాం ఉగ్రదాడి బాధితులు, భారత సైన్యానికి అంకితం ఇస్తున్నట్లు సూర్య వెల్లడించాడు. ఇప్పుడు అదే పాక్ కడుపు మంటకు కారణమైంది. సూర్య వ్యాఖ్యలు రాజకీయపరంగా ఉన్నాయంటూ ఐసీసీ దృష్టికి పీసీబీ తీసుకెళ్లింది.

# ఫైనల్ ముందు టీమిండియాను వెంటాడుతున్న భయం ఏంటి?

ఆసియా కప్ 2025లో టీమిండియా అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా గ్రూప్ దశలో అప్రతిహతంగా విజయాలను సాధించింది. సూపర్-4 రౌండ్‌లోనూ బలమైన పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లను వరుసగా ఓడించి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు బలంగా కనిపిస్తున్నా.. భారత జట్టును ఓ భయం వెంటాడుతోంది. అదే.. దారుణమైన ఫీల్డింగ్ వైఫల్యం. టీమిండియా వరుసగా 2 సూపర్-4 మ్యాచ్‌లలో చేసిన ఈ పెద్ద పొరపాటే ఫైనల్లో టైటిల్‌ను దూరం చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పాకిస్తాన్ జట్టుతో జరిగిన కీలకమైన సూపర్-4 మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు చూపించిన ప్రదర్శన ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. జట్టు ఏకంగా 5 క్యాచ్‌లు వదిలేసింది. అంతే కాకుండా ఓ సులవైన రనౌట్ అవకాశాన్ని కూడా కోల్పోయింది. అంటే 6 వికెట్లు తీసే అవకాశాలను వదులుకోవడం ప్రపంచ స్థాయి జట్టుగా పేరున్న భారత్ కు తగని విషయం. ఈ వైఫల్యం జట్టుపై తీవ్ర ఒత్తిడిని పెంచింది. పాకిస్థాన్‌పై చేసింది ఒక్క మ్యాచ్ పొరపాటు అనుకుంటే.. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా ఫీల్డింగ్‌లో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. ఆ మ్యాచ్‌లోనూ భారత ఆటగాళ్లు 5 క్యాచ్‌లు వదిలేశారు. ఇందులో అత్యంత విచిత్రమైన అంశం ఏమిటంటే, ఈ 5 క్యాచ్‌లలో ఏకంగా నాలుగు క్యాచ్‌లు కేవలం ఒకే బ్యాట్స్‌మెన్ సైఫ్ హసన్ ఇచ్చినవే. "క్యాచెస్ విన్ మ్యాచెస్" (క్యాచ్‌లు మ్యాచ్‌లను గెలిపిస్తాయి) అనే సూత్రం క్రికెట్‌లో అందరికీ తెలిసిందే. సూపర్-4 మ్యాచ్‌లలో తక్కువ బలమైన జట్లపై ఈ పొరపాట్లు చేసినా విజయం సాధించినప్పటికీ, ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌లలో ఇలాంటి చిన్న పొరపాటు కూడా జట్టుకు భారీ నష్టాన్ని, టైటిల్‌ను కోల్పోయే ప్రమాదాన్ని కలిగించవచ్చు. ప్రపంచ స్థాయి జట్టుగా ఉన్న టీమిండియా ఫైనల్‌కు ముందు తమ ఫీల్డింగ్ లోపాలను తక్షణమే సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే, అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్ చేరినా.. కప్పు గెలిచే అవకాశం చేజారే ప్రమాదం ఉంది. ఫైనల్‌లో టీమిండియా తమ ఫీల్డింగ్‌ను పటిష్టం చేసుకొని టైటిల్‌ను గెలుచుకుంటుందో లేదో వేచి చూడాలి.

# బిగ్ బాష్ లీగ్‌లోకి రవిచంద్రన్ అశ్విన్

భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచంలోని అత్యుత్తమ స్పిన్ బౌలర్లలో ఒకరైన రవిచంద్రన్ అశ్విన్.. ఆస్ట్రేలియాలోని ప్రముఖ బిగ్ బాష్ లీగ్ టీ20 టోర్నమెంట్‌లో ఆడటానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. సిడ్నీ థండర్ జట్టు తమ 15వ బీబీఎల్ సీజన్ కోసం అశ్విన్‌ను తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీని ద్వారా బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న అత్యంత ప్రసిద్ధ, సీనియర్ భారతీయ ఆటగాడిగా రవిచంద్రన్ అశ్విన్ ఘనత సాధించారు. బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న మొదటి భారతీయ ఆటగాడు అశ్విన్ అని విస్తృతంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. ఆ గౌరవం భారత అండర్-19 జట్టు మాజీ కెప్టెన్ ఉన్ముక్త్ చంద్ కు దక్కుతుంది. ఉన్ముక్త్ చంద్ భారత క్రికెట్ నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత, 2021-22 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున ఆడాడు. ప్రస్తుతం ఉన్ముక్త్ చంద్ అమెరికా కోసం క్రికెట్ ఆడుతున్నాడు. బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఐపీఎల్‌తో సహా భారత క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి పదవీ విరమణ చేసిన ఆటగాళ్లు మాత్రమే విదేశీ టీ20 లీగ్‌లలో పాల్గొనడానికి అర్హులు. ఈ విధంగా చూస్తే, భారత క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తర్వాత బిగ్ బాష్ లీగ్‌లో చేరిన రెండో భారతీయ ఆటగాడు, అత్యంత ప్రముఖ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్. రవిచంద్రన్ అశ్విన్ గతేడాది డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి, గత నెలలో ఐపీఎల్ టోర్నమెంట్ నుంచి తన రిటైర్మెంట్‌ను ప్రకటించారు. ఈ రిటైర్మెంట్ నిర్ణయమే అతనికి విదేశీ లీగ్‌లలో ఆడేందుకు మార్గం సుగమం చేసింది. 38 ఏళ్ల అశ్విన్ తన 221 మ్యాచ్‌ల ఐపీఎల్ కెరీర్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌తో




సహా ఐదు జట్ల తరఫున ఆడి 187 వికెట్లు తీశారు. అంతర్జాతీయ స్థాయిలో 287 మ్యాచ్‌లలో 765 వికెట్లు పడగొట్టి, టెస్ట్ క్రికెట్‌లో 537 వికెట్లతో ప్రపంచంలో 7వ ప్రముఖ బౌలర్‌గా నిలిచారు. ఈ కొత్త ఒప్పందం గురించి రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ.. "సిడ్నీ థండర్ జట్టు నన్ను ఎలా ఉపయోగించుకోబోతున్నారనే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నారు. నన్ను ఆడించే విషయంలో వారికి ధైర్యం కూడా ఉంది. ఆ జట్టు నాయకులతో నేను జరిపిన సంభాషణలు చాలా బాగున్నాయి. డేవిడ్ వార్నర్ ఆడే విధానం నాకు చాలా ఇష్టం, మన కెప్టెన్ కూడా మనలాగే ఆలోచించడం ఎల్లప్పుడూ మంచి విషయం. థండర్ అభిమానుల కోసం నా అత్యుత్తమ ఆటను ప్రదర్శించడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. సిడ్నీ థండర్ జనరల్ మేనేజర్ ట్రెంట్ కోప్లాండ్ మాట్లాడుతూ, "అశ్విన్ సిడ్నీ థండర్ జట్టును ఎంచుకోవడం నాకు చాలా గర్వంగా ఉంది. అతని ఉత్సాహం, విజయం సాధించాలనే కోరిక మమ్మల్ని ఆకర్షించాయి. టోర్నమెంట్ మధ్యలో అతని ప్రపంచ స్థాయి బౌలింగ్ జట్టుకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుంది. ఒక నాయకుడిగా, మార్గదర్శకుడిగా యువ ఆటగాళ్లకు అతని అనుభవం వెలకట్టలేనిది. పశ్చిమ సిడ్నీలో వేగంగా పెరుగుతున్న భారతీయ సమాజంతో అశ్విన్ అనుబంధం మాకు కొత్త అభిమానులను సృష్టిస్తుంది" అని అన్నారు. అశ్విన్ సిడ్నీ థండర్ జట్టులో డేవిడ్ వార్నర్, లాకీ ఫెర్గూసన్, సామ్ బిల్లింగ్స్, పాకిస్తాన్ ఆటగాడు షదాబ్ ఖాన్ వంటి స్టార్ ఆటగాళ్లతో కలిసి ఆడనున్నారు.

**సిడ్నీ థండర్ స్క్వాడ్:**

వెస్ అగర్, టామ్ ఆండ్రూస్, రవిచంద్రన్ అశ్విన్ (భారత్), కామెరూన్ బాన్‌క్రాఫ్ట్, సామ్ బిల్లింగ్స్ (ఇంగ్లాండ్), ఓలి డేవిస్, లాకీ ఫెర్గూసన్ (న్యూజిలాండ్), మాథ్యూ గిల్క్స్, క్రిస్ గ్రీన్, ర్యాన్ హాడ్లీ, షదాబ్ ఖాన్ (పాకిస్తాన్), సామ్ కోన్‌స్టాస్, నాథన్ మెక్‌ఆండ్రూ, బ్లేక్ నికితారాస్, డేనియల్ సామ్స్, తన్వీర్ సంఘా, డేవిడ్ వార్నర్.



# జయం రవికి మరో షాక్

## ఇంటిని వేలం వేయనున్న బ్యాంకు

తమిళ నటుడు జయం రవి(రవి మోహన్) మరోసారి వార్తల్లోకెక్కాడు. ఇప్పటికే తన భర్య ఆర్తితో విడాకుల వివాదం కోర్టులో నడుస్తుండగా.. తాజాగా అతడి ఇల్లు వివాదంలో చిక్కుకుంది. చెన్నైలోని ఇంజంబక్కంలో ఉన్న ఆయన ఇంటిని వేలం వేయడానికి బ్యాంకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ ఇంటికి సంబంధించి జయం రవి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో ప్రైవేటు బ్యాంక్ అధికారులు ఆయన ఇంటికి వేలం నోటీసులను అంటించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్త కోలీవుడ్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. జయం రవి తన ఇంటి కోసం ఒక ప్రైవేటు బ్యాంక్ నుంచి పెద్ద మొత్తంలో గృహ రుణం తీసుకున్నట్లు సమాచారం. ఈ రుణానికి సంబంధించిన నెలవారీ ఈఎంఐలను ఆయన చెల్లించకపోవడంతో వడ్డీతో కలిపి సుమారు రూ.7.60 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయినట్లు బ్యాంకు జారీ చేసిన నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఈ రుణం చెల్లించమని బ్యాంక్ యాజమాన్యం గతంలో పలుమార్లు జయం రవికి నోటీసులు పంపించింది. కానీ వాటికి జయం రవి స్పందించకపోవడంతో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఆస్తులు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ కింద ఈ ఇంటిని వేలం వేసి తమ బకాయిలను వసూలు చేసుకోవడానికి బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది.

# షారూక్ ఖాన్‌పై పరువునష్టం కేసు



మాజీ నార్కోటిక్స్ ఆఫీసర్ సమీర్ వాంఖడే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ ద బాడ్స్ ఆఫ్ బాలీవుడ్‌తో పాటు నటుడు షారూక్ ఖాన్‌పై ఆయన పరువు నష్టం కేసు వేశారు. ఆర్యన్ ఖాన్ డైరెక్ట్ చేసిన వెబ్‌సిరీస్‌లో నార్కోటిక్స్ ఆఫీసర్ పాత్రను తప్పుగా చూపించినట్లు ఆయన ఆరోపించారు. షారూక్‌తో పాటు రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్ నుంచి వాంఖడే రెండు కోట్ల నష్టపరిహారాన్ని కోరాడు. తనకు వచ్చే నష్టపరిహారాన్ని టాటా మెమోరియల్ క్యాన్సర్ ఆస్పత్రికి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆ వెబ్ సిరీస్‌లో యాంటీ డ్రగ్ ఎన్‌పోర్స్‌మెంట్ ఏజెన్సీలను నెగటివ్ పాత్రలో చూపించినట్లు ఆరోపించారు. ప్రజా వ్యవస్థలపై విశ్వాసం కోల్పోయే రీతిలో ఆ సిరీస్ ఉన్నట్లు పేర్కొన్నారు. ద బాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సిరీస్‌లో ఓ క్యారెక్టర్‌ను సమీర్ వాంఖడే ప్రేరణతో తీశారు. బాలీవుడ్ పార్టీ జరుగుతున్న ప్రదేశానికి వచ్చిన ఆ ఆఫీసర్ ఎవరు డ్రగ్స్ తీసుకుంటున్నారో ఆరా తీస్తాడు. సెప్టెంబర్ 18వ తేదీ నుంచి ఆ వెబ్‌సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. సమీర్ వాంఖడే గౌరవానికి భంగం కలిగించే రీతిలో కావాలనే పాత్రను సృష్టించారని వాంఖడే తన స్టేట్మెంట్‌లో తెలిపారు. సమీర్ వాంఖడే, ఆర్యన్ ఖాన్‌కు చెందిన కేసు ప్రస్తుతం ముంబై హైకోర్టులో ఉందని వాంఖడే వాంగ్మూలం ద్వారా తెలిసింది. 2021, అక్టోబర్ 3వ తేదీన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఆర్యన్ ఖాన్, అయాజ్ మర్చెంట్, మున్మున్ దమేచాను అరెస్టు చేసింది. నిషేధిత డ్రగ్స్‌ను కలిగి ఉన్నట్లు, అమ్ముతున్నట్లు కేసు బుక్ చేశారు. ఓ క్రూయిజ్ షిప్‌ను రెయిడ్ చేసిన తర్వాత ఆ షిప్‌లో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 20 మందిని అరెస్టు చేశారు. ఆ కేసు దర్యాప్తును సమీర్ వాంఖడే చూశాడు. ఆర్యన్ ఖాన్25 రోజుల పాటు జైలుశిక్ష అనుభవించాడు. ఆ తర్వాత బెయిల్ దొరికింది. 2022, మే నెలలో ఆర్యన్ ఖాన్‌పై ఉన్న కేసుల్ని కొట్టిపారేశారు. నార్కోటిక్స్ ఆఫీసర్ వాంఖడేను బ్లాక్‌మెయిల్ ఆరోపణల కింద విధుల నుంచి తొలగించారు.




# ఆ టాలీవుడ్ హీరో వల్లే సాధ్యం..

## డాన్స్ పెర్ఫార్మన్స్ పై తమన్నా కామెంట్స్!

అల్లు అర్జున్ ని డాన్స్ లో బీట్ చేసేవారు ఎవరు లేరు అంటారు ఆయన అభిమానులు. అల్లు అర్జున్ డాన్స్ మూమెంట్స్ ప్రతి ఒక్క సినిమాలో చాలా అద్భుతంగా ఉంటాయి. ఎంతోమంది ఈయన డ్యాన్స్ చూసే అభిమానులుగా మారతారు.అయితే అలాంటి అల్లు అర్జున్ కారణంగానే తాను కూడా డ్యాన్స్ లో పర్ఫెక్షన్ నేర్చుకున్నాను అంటోంది ఓ హీరోయిన్. ఆమె ఎవరో కాదు తమన్నా.. రీసెంట్ గా తమన్నా పలు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేస్తూ తన డాన్స్ తో ఆకట్టుకుంటుంది. అయితే తనకి డ్యాన్స్ ఇంత పర్ఫెక్ట్ గా రావడానికి కారణం అల్లు అర్జున్ అంటూ తాజా ఇంటర్వ్యూలో బయటపెట్టింది. తమన్నా ఇటీవల తాను నటించిన 'డు యూ వన్నా పార్ట్నర్' అనే వెబ్ సిరీస్ ప్రమోషన్స్ లో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నేను అల్లు అర్జున్ కారణంగానే డాన్స్ లో ఉండే నైపుణ్యాలను నేర్చుకున్నాను. బద్రీనాథ్ సినిమా చేసే సమయంలో అల్లు అర్జున్ నన్ను చాలా ఎంకరేజ్ చేశాడు. ఆయన నుండే నేను డాన్స్ పర్ఫెక్షన్ నేర్చుకున్నాను. అల్లు అర్జున్ ఇచ్చిన సలహా.. డ్యాన్స్ ను మెరుగుపరచడంలో సహాయపడింది. అందుకే సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేయడానికి కూడా ఒప్పుకుంటున్నాను" అంటూ తెలియజేసింది. అలా అల్లు అర్జున్ కారణంగా డాన్స్ లో ఉండే పర్ఫెక్షన్ నేర్చుకున్న తమన్నా.. ఇలా ఎన్నో సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేస్తూ అలరిస్తోంది. ముఖ్యంగా చాలామంది తమన్నా అభిమానులు ఆమెని సినిమాలో కీ రోల్ లో చూడడం కంటే.. సినిమాలో స్పెషల్ సాంగ్ లో చూడడానికే ఇష్టపడుతున్నారు. అందుకే చాలామంది దర్శక నిర్మాతలు కూడా ఫ్యాన్స్ కోరిక మేరకు తమన్నాని ఎక్కువగా స్పెషల్ సాంగ్స్ లో తీసుకుంటున్నారు. అలా రీసెంట్గా బాలీవుడ్ లో వచ్చిన స్త్రీ 2 మూవీలో "ఆజ్ కీ రాత్" పాటతో సంచలనం సృష్టించడమే కాకుండా తాజాగా షారుక్ ఖాన్ తనయుడు తీసిన వెబ్ సిరీస్ లో "గఫూర్" అనే స్పెషల్ సాంగ్ తో అందరినీ ఆకట్టుకుంది. అలాగే కోలీవుడ్లో రజినీకాంత్ నటించిన జైలర్ మూవీలో "నువ్వు కావాలయ్యా" అనే పాటతో సౌత్ ఇండస్ట్రీని షేక్ చేసింది తమన్నా. అలా తన డ్యాన్స్ స్టెప్పులతో అందరినీ అలరిస్తూ వరుస ఆఫర్స్ అందుకుంటుంది..



## హాట్ ఫోజులతో చెమటలు పట్టిస్తున్న జాన్వీ కపూర్!

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తాజాగా సాంప్రదాయ దుస్తులతో మెరిసింది. జాన్వీ కపూర్ లేటెస్ట్ లుక్ కి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఈ ఫోటోలు పంచుకోవడంతోపాటు అభిమానులకు నవరాత్రి శుభాకాంక్షలు చెబుతూ సోషల్ మీడియాలో ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. జాన్వీ కపూర్ నుండి రాబోయే తాజా మూవీ 'సన్నీ సంస్కారీకి తులసీ కుమారి'.. ఈ సినిమా చిత్ర యూనిట్ తో కలిసి జాన్వీ కపూర్ దిగిన కొన్ని అద్భుతమైన ఫోటోలని తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. ఈ ఫోటోలలో జాన్వీ కపూర్ తో పాటు చిత్రయూనిట్ అందరూ ట్రెడిషనల్ డ్రెస్సులు వేసుకొని కనిపించారు. అలాగే ఈ ఫోటోకి క్యాప్షన్ గా "నవరాత్రి శుభాకాంక్షలు" అంటూ రాసుకొచ్చింది. సాంప్రదాయమైన దుస్తులు ధరించిన జాన్వీ కపూర్ ఆ లుక్ లో చాలా అద్భుతంగా కనిపించింది.. సాంప్రదాయ దుస్తుల్లో కూడా హాట్ ఫోజులు ఇచ్చింది అంటూ కొంతమంది ఫాలోవర్స్ కామెంట్లు చేస్తున్నారు. తాజాగా తన రాబోయే మూవీ సన్నీ సంస్కారీకి తులసి కుమారి అనే మూవీ ప్రమోషన్స్ లో భాగంగా అహ్మదాబాద్ లో జరిగిన నవరాత్రి వేడుకల్లో పాల్గొని సినిమాకి ప్రత్యేక ప్రమోషన్స్ చేసుకుంది. అంతేకాకుండా గుజరాత్ లోని ప్రజలతో కలిసి గర్బా స్టెప్పులు వేసి అక్కడున్న అభిమానులను ఆశ్చర్యపరిచింది. అలా ఓ రకంగా సంస్కృతిని పాటించడంతోపాటు తన సినిమాకి ప్రమోషన్ కూడా చేసుకుంది జాన్వీ కపూర్.. ప్రస్తుతం జాన్వీ కపూర్ కి సంబంధించిన ఈ ఫోటోలు,వీడియోలు నెట్టింట వైరల్ గా మారడంతో చాలామంది నెటిజన్లు జాన్వీ కపూర్ లుక్ కి ఫిదా అవుతున్నారు.

# సమంత వాచ్ ధర అంత ఉంటుందా..?



తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో తన నటనతో పాటు స్టైలిష్ ఫ్యాషన్ సెన్సేషన్‌గా నిలిచిన అందాల తార సమంత తాజాగా కొత్త లగ్జరీ వాచ్ ధరించి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. ఇటీవల సమంత సినిమాల కన్నా కూడా బ్రాండ్లని ప్రమోట్ చేస్తూ ఎక్కువగా వార్తలలో నిలుస్తుంది. తాజాగా ఒక లగ్జరీ వాచ్ ను ధరించిన సామ్ అందుకు సంబంధించిన ఫొటోలను షేర్ చేయగా,ఇవి నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.అయితే సమంత ధరించిన ఆ వాచ్ అందరి దృష్టిని ఆకర్షించగా, అది ఏ కంపెనీది..? దాని ధర ఎంత ? అంటూ గూగుల్ లో ఆరా తీస్తున్నారు . ఈ క్రమంలో సమంత ధరించిన వాచ్ ట్రాపెజ్ ఆకారంలో ఉండే పియాజెట్ 60 జువెలరీ వాచ్ కాగా , దీని రేటు సుమారు రూ.30 లక్షలకు పైగా ఉంటుందని తెలుస్తోంది. ఇది తెలుసుకున్న నెటిజన్లు అవాక్కవుతున్నారు. గతంలోనూ సమంత పలు స్టైలిష్ అండ్ లగ్జరీ వాచెస్ ధరించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె ఎక్కువగా బల్గారీ సర్పెంటీ వాచ్ (రూ. 45 లక్షలకు పైగానే) ధరించి కనిపిస్తుంటుంది. మొత్తానికి సమంత ఈ కొత్త వాచ్‌తో హాట్ టాపిక్ అయింది. ఇక సినిమాల విషయానికి వస్తే సమంత ప్రస్తుతం నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న "మా ఇంటి బంగారం" సినిమాలో నటిస్తోంది. అంతేకాదు, రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందుతోన్న వెబ్ సిరీస్ "రక్త బ్రహ్మాండ్" లోనూ సమంత తన నటనా ప్రతిభను చాటేందుకు కృషి చేస్తుంది. ఇకపోతే సమంత–రాజ్ జంట ప్రేమ వ్యవహారం ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ముంబై బాంద్రాలోని ఓ జిమ్ నుంచి కలిసి బయటకు రావడం, ఒకే కారులో వెళ్లిపోవడం వంటివి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఇద్దరి మధ్య ఏదో నడుస్తుందని, త్వరలోనే వివాహం చేసుకోవడం ఖాయం అని అంటున్నారు. కొన్నాళ్లుగా వీరి రిలేషన్ గురించి అనేక వార్తలు వస్తున్నా కూడా సమంత కాని, రాజ్ కాని స్పందించింది లేదు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463